# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 146 | హైదరాబాద్ | బుధవారం 26-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

టీ20 వరల్డ్ కప్2026 బ్రాండ్ అంబాసిడర్ గా రోహిత్ శర్మ




## ఢిల్లీలో వాయు కాలుష్యం..
# రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం

11లో

- ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం
- కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- విద్యుత్ వాహనాలను విస్తృతపరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచన

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్..
### మూడు విడతల్లో పోలింగ్

- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- నేటి నుంచి అమల్లోకి ఎన్నికల నియమావళి
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్



11లో


11లో

## ఆ అధ్యక్షుడిని మార్చండి..!
### సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి ఘాటు లేఖ

- పున్నా కైలాశ్ తమ కుటుంబం పట్ల తీవ్ర పదజాలం ఉపయోగించారన్న మంత్రి
- అతనిని వెంటనే డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్

## కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు..
### తాజాగా 28 మంది సరెండర్

11లో


- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ
- లొంగిపోయిన వారిలో 19 మంది మహిళలు
- వీరిపై రూ. 89 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడి
- 'పున మర్గం' కార్యక్రమం సత్ఫలితాల నిస్తున్నాయన్న అధికారులు
- ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోలు

## ఇక భారత్‌లోనే హామర్ స్మార్ట్ బాంబుల తయారీ..

11లో



- ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జాయింట్ వెంచర్
- 70 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల స్మార్ట్ బాంబు
- 60 శాతం విడిభాగాలు దేశీయంగానే ఉత్పత్తి చేసేలా ప్రణాళిక

## రాష్ట్రంలో 'ఏపీలింక్' ఏర్పాటు
### లాజిస్టిక్స్ రంగంపై సీఎం చంద్రబాబు ఫోకస్

11లో


- ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ-లింక్) ఏర్పాటుకు సీఎం ఆమోదం
- పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు సహా ఐదు కీలక రంగాల అనుసంధానం

## బాలకృష్ణ సినిమా వేడుకకు చీఫ్ గెస్ట్ గా సీఎం

- ఈ నెల 28న ఘనంగా జరగనున్న వేడుక
- షూటింగ్ బిజీ వల్ల రాలేకపోతున్న అల్లు అర్జున్
- డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల
- డిసెంబర్ 4న ప్రీమియర్ షోలకు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు

11లో




12లో

## మహా విశ్వనగరంగా..
# జిహెచ్ఎంసి...

- ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం ప్రతిపాదనకు సర్వసభ్య సమావేశం ఆమోదం

భారత శక్తి

## రాజ్యాంగంలో భారతీయతపై చర్చ

భారత రాజ్యాంగం, జాతీయ జెండా, కులవ్యవస్థపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అభిప్రాయాలపై ఎప్పుడూ విమర్శలు వినిపిస్తూనే ఉంటాయి. ఈ మూడు ప్రధాన అంశాలపై స్వాతంత్ర్యం నుంచి ఇప్పటిదాకా అనేక సందర్భాల్లో ఆర్‌ఎస్ఎస్ చాలాసార్లు తన అభిప్రాయాలు మార్చుకుంది."అనేక పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు తీసుకుని వైవిధ్యభరితంగా మన రాజ్యాంగం రూపొందించారు. దాంట్లో మన సొంతం అని పిలవడానికి ఏదీ లేదు. మన జాతీయ లక్ష్యానికి సంబంధించి, మన జీవితాల్లోని ప్రాధాన్యాలకు సంబంధించి ఒక్క పదమన్నా అదులో ఉందా? లేదు.." అని 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో సంఘ్ రెండో అధ్యక్షుడు మాధవ్ సదాశివరావ్ గోల్‌వాల్కర్ రాశారు''రేపు అధికారం చేపట్టబోతున్నవాళ్లు మన చేతుల్లో త్రివర్ణజెండా ఉంచుతారు. కానీ దాన్ని హిందువులు ఎప్పుడూ గౌరవించరు, తమ సొంతంగా భావించరు. మూడు అనే పదం మంచిది కాదు. మూడు రంగులతో ఉండే జెండా మానసికంగా చాలా తీవ్రమైన చెడు ప్రభావం చూపుతుంది. దేశానికి ప్రమాదకరమైనది" అని భారత్‌కు స్వాతంత్ర్యం రావడానికి ఒకరోజు ముందు 1947 ఆగస్టు 14న తన పత్రిక ఆర్గనైజర్‌లో ఆర్ఎస్ఎస్ రాసిన వ్యాఖ్యలను చాలామంది విమర్శిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించిందని ప్రముఖ లాయర్, రాజకీయ వ్యాఖ్యాత ఏజీ నురానీ 'ది ఆర్ఎస్ఎస్: దేశానికి ప్రమాదం' అనే తన పుస్తకంలో రాశారు. ఏజీ నురానీ బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పనిచేశారు.''రాజ్యాంగాన్ని హిందూ వ్యతిరేకమైనదిగా పేర్కొంటూ, దేశంలో తాము ఎలాంటి రాజకీయం కోరుకుంటున్నామో తెలియజేస్తూ 1993 జనవరి 1న సంఘ్ శ్వేతపత్రం ప్రచురించింది. భారత్ సమగ్రతను, సోదరభావాన్ని, మతపరమైన సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసింది ఎవరు? ఆకలి చావులకు, నిరుద్యోగితకు, అవినీతికి, మతపరమైన అసహనానికి కారణం ఎవరు? దీనికి సమాధానం 'భారత ప్రస్తుత రాజ్యాంగం' అనే శ్వేతపత్రంలో ఉంది" అని నురానీ రాశారు. 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన కొన్ని రోజుల తర్వాత ఈ శ్వేతపత్రం ప్రచురితమైంది."ప్రస్తుత రాజ్యాంగం దేశ సంస్కృతి, స్వభావం, పరిస్థితులు మొదలైన వాటికి విరుద్ధంగా ఉంది. దీనిపై ఇతర దేశాల ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసిన తర్వాతే మన ఆర్థిక విధానం, న్యాయ, పరిపాలనా నిర్మాణం, ఇతర జాతీయ సంస్థల గురించి మనం కొత్తగా ఆలోచించాల్సి ఉంటుంది" అని శ్వేతపత్రం పీఠికలో స్వామి హిరానంద్ రాసినట్టు నురానీ చెప్పారు. రాజ్యాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఈ దేశం నీతి, ప్రతిభకు అనుగుణంగా రాజ్యాంగాన్ని స్వీకరించాలని 1993 జనవరిలో అప్పటి ఆర్ఎస్ఎస్ చీఫ్ రాజేంద్ర సింగ్ రాశారని తన పుస్తకంలో నురానీ పేర్కొన్నారు. 1993 జనవరి 24న అప్పటి బీజేపీ అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి కూడా రాజ్యాంగాన్ని కొత్తగా పరిశీలించాలనే డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో పునరుద్ఘాటించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, కొంతమంది బీజేపీ నేతలు 'అబ్‌కి బార్ 400 పార్' (ఈసారి మేము 400 దాటతాం)అన్న నినాదం నిజమైతే...అది రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రకటనలు చేయడం ప్రారంభించారు. అలా చేయాలనే ఉద్దేశం లేదని బీజేపీ చాలాసార్లు స్పష్టం చేసినప్పటికీ, రాజ్యాంగంలో భారీగా ప్రాథమిక మార్పులు చేయడానికి పార్టీ ప్రయత్నించిన ఉదాహరణలు ఉన్నాయిఅటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, వారు చేసిన మొదటి పని రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం. చాలా గందరగోళం చెలరేగిన తర్వాత వారు కమిటీ ఏర్పాటుకు గల కారణాన్ని మార్చారు. రాజ్యాంగాన్ని పూర్తిగా సమీక్షించడానికి బదులుగా, ఇప్పటివరకు రాజ్యాంగం ఎలా పనిచేసిందో కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు" అని నీలాంజన్ ముఖోపాధ్యాయ్ తెలిపారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారని, ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో కొత్త రాజ్యాంగం ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావించాయని ముఖోపాధ్యాయ్ తెలిపారు. నరేంద్ర మోదీ మాత్రం 2014లో ప్రధాని అయిన వెంటనే రాజ్యాంగం భారతదేశంలోని ఏకైక పవిత్ర గ్రంథం అని, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయం అని పిలవడం ప్రారంభించారు"ఈ రాజ్యాంగాన్ని మన ప్రజలు తయారుచేశారు. రాజ్యాంగం మన దేశ ఏకాభిప్రాయం. కాబట్టి రాజ్యాంగాన్ని క్రమశిక్షణగా అనుసరించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఆర్ఎస్ఎస్ ఇప్పటికే దీన్ని విశ్వసిస్తోంది. స్వతంత్ర భారతదేశం అన్ని చిహ్నాలను, రాజ్యాంగ స్ఫూర్తిని మేము పూర్తిగా గౌరవిస్తూనే ఉన్నాం" అని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ 2018లో దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మాట్లాడుతూ అన్నారు. బద్రీ నారాయణ్ ఒక సామాజిక చరిత్రకారుడు, సాంస్కృతిక శాస్త్రవేత్త. ఆయన ప్రస్తుతం అలహాబాద్‌లోని గోవింద్ వల్లభ్ పంత్ సోషల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.''రాజ్యాంగాన్ని పూర్తిగా గౌరవిస్తున్నామని, రాజ్యాంగంతో ఉన్నామని, రాజ్యాంగ విలువలను విశ్వసిస్తున్నామని కొన్నేళ్లగా ఆర్ఎస్ఎస్ స్పష్టం చేస్తోంది. వివాదాలు సృష్టించాలనుకునేవారు ఏ విషయాన్నయినా లేవనెత్తవచ్చు. అన్నింటిలో రాజకీయాలు చూడొచ్చు. మోహన్ భగవత్ లేదా ఆయన కంటే ముందు బాలాసాహెబ్ డియోరాస్ చేసిన ఆర్ఎస్ఎస్ ప్రకటనలను మీరు గమనిస్తే, ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసిస్తోందని స్పష్టంగా తెలుస్తుంది'' అని నారాయణ్ అన్నారు. ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగంతో లోతైన అనుబంధం ఉందని, రాజ్యాంగానికి సంబంధించి గత రెండు దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ వైఖరి రాజ్యాంగానికి అనుకూలంగా ఉందని, అందులో ఎలాంటి వైరుధ్యం లేదని ప్రొఫెసర్ బద్రీ నారాయణ్ చెప్పారు.

# కట్టుతప్పుతున్న ఎమ్మెల్యేలు

విజయవాడ, నవంబర్ 25,

2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన, బీజేపీ కూటమి 164 సీట్లతో అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేవలం 11 సీట్లతో ప్రతిపక్షంగా మిగిలింది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ అసెంబ్లీకి రావడం మానేశారు. ఈ "బలహీన ప్రతిపక్షం" కూటమి ప్రభుత్వానికి "సమస్యగా" మారిన సూచనలు కనిపిస్తున్నాయి. తమకు "ఎదురు లేదని" ఎమ్మెల్యేలు కట్టుతప్పుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడం రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా మార్చేసింది. అవినీతి ఆరోపణలు, పాలనలో ఘోరాలు, రైతులు, మహిళలు, యువతలో అసంతృప్తి కారణంగా వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. వైసీపీకి ప్రతిపక్ష హోదాకు అవకాశం లేకపోవడం వల్ల.. అసెంబ్లీ రూల్స్ ప్రకారం 10% సీట్లు అవసరం అయినా రాకపోవడం వల్ల "సైలెంట్ ఓపోజిషన్" స్థితిని సృష్టించింది. ప్రతిపక్ష బలహీనత ప్రభుత్వానికి "ఫ్రీ పాస్" ఇస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ రాకపోవడం, హౌస్ కమిటీల్లో ఉండకపోవ ఫలితంగా, ప్రభుత్వ నిర్ణయాలపై రాజ్యాంగ వేదికపై ప్రశ్నించడం తగ్గిపోయింది."సరైన ప్రతిపక్షం లేకపోవడం" కూటమి ప్రభుత్వానికి రెండు వైపులా సమస్యలు సృష్టిస్తోంది. ఎదురు లేకపోవడం వల్ల ప్రభుత్వం సులభంగా రీఫార్మ్స్ అమలు చేస్తోంది. జనసేన, బీజేపీలు కూటమి భాగస్వాములు కావడం వల్ల అంతర్గత విమర్శలు తక్కువ. కానీ ప్రతిపక్షం లేకపోవడం "అకౌంటబిలిటీ"ను తగ్గిస్తుంది. వైసీపీ అసెంబ్లీకి రాకపోవడం పార్లమెంటరీ డెమాక్రసీకి దెబ్బ అనుకోవచ్చు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం ప్రభుత్వాన్ని "అబ్యూజ్ ఆఫ్ పవర్"కు ప్రేరేపిస్తుంది. ఇప్పుడు అదే జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష బలహీనత వల్ల కొంతమంది ఎమ్మెల్యేలు "కట్టుతప్పుతున్నారన్న"ఆరోపణలుపెరిగాయి. ఎదురు లేకపోవడం వల్ల "చెక్స్ అండ్ బాలెన్సెస్" లేకపోవడం అనైతికతకు దారి తీస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల ఎమ్మెల్యేలు "సెల్ఫ్-సర్వింగ్" మోడ్‌లోకి వెళ్లారు. అందుకే ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తున్నాయి. టీడీపీతో పాటు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కూడా కొంత మంది ప్రత్యేకంగా దందాలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేల తీరుపై హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే వారిలో ఎంత మంది పట్టించుకుంటున్నారో లేదో స్పష్టత లేదు. ఎమ్మెల్యేల వల్ల ప్రభుత్వానికి ఎంతో ఇబ్బంది ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్షం లేకపోవడం వల్ల "ఇన్‌ఫైటింగ్" పెరిగే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ-జనసేన మధ్య ఇలాంటివి తరచూ కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో ఉన్నప్పుడు వివిధ అంశాలపై వేర్వేరు అభిప్రాయాలు సహజమే కానీ.. అవి ప్రతిపక్షం లేకపోవడం వల్ల రావడం సమస్యలు సృష్టిస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల అకౌంటబిలిటీని తగ్గించి, అనైతిక ప్రవర్తనలకు దారి తీస్తోంది. ఎమ్మెల్యేలు "ఎదురు లేదని" లాభపడుతున్నారనే ఆరోపణలు నిజమవుతున్నాయి. ఇది లాంగ్-టర్మ్‌లో ప్రభుత్వానికి బూమరాంగ్ అవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం జాగ్రత్త పడాల్సిన అవసరం కనిపిస్తోంది.

# నియోజకవర్గం మార్పు తప్పదా



రాజమండ్రి, నవంబర్ 25,

జనసేనకు చెందిన మంత్రి కందుల దుర్గేష్ ఈసారి నియోజకవర్గాన్ని మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ కందుల దుర్గేష్ సొంత ప్రదేశం రాజమండ్రి కావడంతో వచ్చే ఎన్నికల్లో కందుల దుర్గేష్ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ నుంచి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. గత ఎన్నికల సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నిక అని కూడా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించార. దీంతో వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించి, నిడదవోలు నియోజకవర్గాన్ని టీడీపీకి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కందుల దుర్గేష్ పర్యాటక, సినిమా టోగ్రఫీ మంత్రిగా ఉన్న ప్పటికీ ఆయన ఎక్కువ సమయం రాజమండ్రి లోనే గడుపుతున్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం జనసేన నేతలు, క్యాడర్ తోనూ ఆయన టచ్ లో ఉండటం కూడా ఈ సందేహాలకు మరింత ఊతమిచ్చినట్లు కనిపిస్తుంది. సీనియర్లను క్రమంగా పక్కన పెడుతున్న టీడీపీ అధినాయకత్వం ఈసారి గోరంట్ల బుచ్చయ్య చౌదరికి కూడా టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. ఆయన ఇప్పటికే ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయనకు నామినేటెడ్ పదవి ఇచ్చిపెద్దల సభకు పంపుతామని చెప్పి రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారని, అక్కడి నుంచి కందుల దుర్గేష్ పోటీ చేయడం ఖాయమని చెబుతున్నారు. టీడీపీకి స్ట్రాంగ్ హోల్డ్ గా ఉన్న... నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నిడదవోలు నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014 ఎన్నికల్లో అక్కడి నుంచి టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు గెలిచారు. అంటే ఇక్కడ టీడీపీ స్ట్రాంగ్ గా ఉంది. నిడదవోలు టీడీపీ క్యాడర్ నుంచి కూడా వత్తిడి తీవ్రంగా వస్తుంది. అందుకే నిడదవోలను వచ్చే ఎన్నికల్లో టీడీపీ తీసుకుని, రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే మంత్రి గా ఉన్న కందుల దుర్గేష్ ఎక్కువగా ఇక్కడే పర్యటిస్తూ క్యాడర్ కు తాను వచ్చేస్తున్నానంటూ సంకేతాలను ఇస్తున్నారట. మొత్తం మీద ఎక్స్ఛేంజ్ మేళాలో రెండు సీట్లను పరస్పరం రెండు పార్టీలు మార్పిడి చేసుకుంటాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

## గచ్చిబౌలి తరహాలో కొమ్మాది క్రీడా ప్రాంగణం అభివృద్ధి

విశాఖపట్నం నవంబర్ 25,

భీమిలి సమీపంలోని కొమ్మాది క్రీడా ప్రాంగణంలో హైదరా బాద్ గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ తరహాలో టర్ఫ్ మైదానా న్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 10 వరకు చెన్నై, మధురైలలో జరగనున్న హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ పోటీల ట్రోఫీని ఎమ్మెల్యేలు వెలగపూడి రామ కృష్ణ బాబు, పి. విష్ణుకుమార్ రాజు, సీ. హెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ లతో కలిసి విశాఖ జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా భవనంలో ఆవిష్కరించారు. విశాఖ పట్నం ఆధ్వర్యంలో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ గ్రాండ్ ట్రోఫీ సెలబ్రేషన్స్లో ఎంపీ శ్రీభరత్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ ట్రోఫీని ఆవిష్కరించి, హాకీ క్రీడ అభివృద్ధికి విశాఖపట్నం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ ప్రతిష్ఠాత్మక ట్రోఫీ విశాఖకు రావడం గౌరవకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాకీ క్రీడకు విశాఖ అందించిన సహకారాన్ని ఆయన కొనియాడారు.


# దూరం.. దూరం అంటూనే.. దగ్గరవుతున్న విజయసాయి

విజయవాడ, నవంబర్ 25,

రాజకీయాలకు గుడ్‌బై..ఇక నుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి..రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పి ఏడాది కాకముందే ఎప్పుడూ ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తూ..ఆసక్తికర ట్వీట్స్ చేస్తూ పొలిటికల్ హాట్ టాపిక్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడేమో ఏ పార్టీలో చేరే ఆలోచన లేదంటారు. మరోసారి అవసరమైతే కొత్త పార్టీ పెడతా అంటారు. తన అవసరం ఉందనుకుంటే రాజకీయాల్లోకి వస్తానంటారు. అసలు ఈ పొంతన లేని స్టేట్‌మెంట్స్ ఎందుకన్న చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఎప్పటిలాగే..జగన్ కోటరీ అంటూ డైలాగులు పేల్చారు. పవన్‌ను పొగిడేందుకు ప్రయత్నించారు. తనకు ఆయనతో 20 ఏళ్ల స్నేహం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయనను తాను ఎప్పుడూ ఒక్క మాట కూడా అనలేదని.. భవిష్యత్‌లో కూడా అననని చెప్పారు. కానీ గతంలో పవన్‌ను పావలా అని.. విమర్శించిన విషయాన్ని ఆయన మార్చిపోయారంటూ సోషల్ మీడియాలో మీమ్స్ వస్తున్నాయ్. ఎప్పటికప్పుడు సమ్‌థింగ్ డిఫరెంట్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తూ వస్తున్నారు విజయసాయిరెడ్డి. మొన్నటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లుగా..పబ్లిక్ వాయిస్‌గా ట్వీట్స్ చేస్తూ చర్చకు దారితీశారు. ఇప్పుడేమో తన అవసరమైతే మళ్లీ పాలిటిక్స్‌లోకి వస్తానంటున్నారు. ఆయన అవసరం పబ్లిక్‌కు ఉందా? లేక ఆయనకే రాజకీయాలు తప్పనిసరిగా మారాయా అన్నది ఇక్కడ పాయింట్. విజయసాయిరెడ్డి అవసరం వైసీపీకి ఉండొచ్చు. ఎందుకంటే గతంలో ఆ పార్టీలో నెంబర్.2గా పనిచేశారు. తెరవెనుక రాజకీయాలు చక్కబెట్టడంలో జగన్‌కు సాయిరెడ్డి బ్యాక్ బోన్ లాంటి వాడని చెప్తుంటారు. అలాంటి విజయసాయిరెడ్డి వైసీపీని వీడినప్పటి నుంచి జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్నారు. కోటరీ వల్లే తాను జగన్‌కు దూరమయ్యాను..జగన్‌ను మిస్ అవుతున్నాను అన్నట్లుగా మాట్లాడుతున్నారు విజయసాయిరెడ్డి. తన విషయంలో జగన్ కోటరీ ఆయనను పూర్తిగా డైవర్ట్ చేస్తోందని..అలాంటి వారి మాటలు వినరాదని, అన్నీ ఆలోచించాలని జగన్‌కు సూచించారు. అంటే జగన్ మంచిని కోరుకుంటున్నాను అన్నట్లుగా చెప్పుకొచ్చారు విజయసాయిరెడ్డి. విజయసాయిరెడ్డి మాజీ ఎంపీ మాత్రమే కాదు..మాజీ వైసీపీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. ఆయన ఏం మాట్లాడినా పొలిటికల్ యాంగిల్ వెతకడం, దాన్ని హైలెట్ చేయడం కామన్. ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా విజయసాయిరెడ్డి చేసిన కామెంట్స్ పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. సాయిరెడ్డి మనసు వైసీపీ వైపు లాగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదో ఒక ఫైన్ మార్నింగ్ విజయసాయిరెడ్డి వైసీపీలో చేరిక ప్రకటన రావొచ్చన్న ఊహాగానాలు ఉండే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తోంది. వైసీపీ అధినేత జగన్ పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ వస్తున్నారు. పార్టీకి దూరమైన నేతలను దగ్గర చేసే ప్రయత్నాల్లో పడ్డారు. మొన్నా మధ్య పార్టీని విడిచి వెళ్లిపోయిన నేతలు తిరిగి పార్టీలోకి రావొచ్చు..నో అబ్జక్షన్స్ అంటూ వైసీపీ ఇంటర్నల్ మీటింగ్‌లో ఓపెన్ ఆఫర్ ఇచ్చారు జగన్. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీ గూటికి చేరతారని పెద్దఎత్తున ప్రచారం కూడా నడిచింది. అయితే జగన్ నుంచే పిలుపు రావాలని విజయసాయిరెడ్డి ఎదురుచూస్తున్నట్లు ఇన్ సైడ్ టాక్. ఇది ఎంతవరకు నిజమో తెలియదు కానీ..వ్యవసాయం చేసుకుంటానని చెప్పి..విజయసాయిరెడ్డి తరచూ రాజకీయాలు..పొలిటికల్ రీఎంట్రీపై మాట్లాడుతుండటం మాత్రం ఆయనలో ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్‌ను స్పష్టం చేస్తోంది. రాబోయే రోజుల్లో విజయసాయిరెడ్డి రాజకీయ అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.

సైరా నరసింహారెడ్డి సంగతేంటీ

ఇక.. పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్, అన్నమయ్య, అల్లూరి



సీతారామరాజు, రాజశేఖర్ రెడ్డి పేరుతో జిల్లాలు ఉన్నాయని.. సైరా నరసింహారెడ్డి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని ఆయన సూచించారు. అలా చేస్తే ఒక స్వాతంత్ర్య సమరయోధుడిని గౌరవించినట్టు అవుతుందన్నారు. శ్రీకాకుళంలో రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి మొత్తం నేనే భరిస్తాను అని చెప్పారు. చాలామంది నాపై చాలా సెటైర్లు వేస్తున్నారన్న విజయసాయిరెడ్డి.. ఎవరెన్ని అనుకున్నా నేను ప్రస్తుతం రైతును మాత్రమే అని తేల్చి చెప్పారు. చాలా ఒత్తిళ్లు వచ్చాయి. ప్రస్తుతానికి రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదు. ఇతర పార్టీల్లోనూ చేరే ఉద్దేశమూ లేదు. విపరీతమైన ఒత్తిడి వచ్చినా నేను ఎవరికీ లొంగలేదు. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ని డైవర్ట్ చేస్తోంది. అందుకే నేను రాజకీయాలకు దూరంగా ఉంటున్నా. నిబద్ధత లేని వారి మాటలు వినొద్దని జగన్ కు నా సూచన. నాకు ఏ పార్టీ నుంచి కూడా పిలుపు రాలేదు. ప్రస్తుతానికి నేను రైతును మాత్రమే. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో 20 ఏళ్ల స్నేహం ఉంది. ఆయనను ఒక్క మాట కూడా అనలేదు" అని హాట్ కామెంట్స్ చేశారు విజయసాయిరెడ్డి.

# ఎమ్మెల్యే సోదరుడి ఆస్తులు అటాచ్ మెంట్

హైదరాబాద్, నవంబర్ 25,

అక్రమ మైనింగ్, మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి యజమానిగా ఉన్న సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థకు చెందిన సుమారు రూ. 80.05 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ విభాగం జప్తు చేసింది. ఈ మేరకు ఈడీ కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థ తమకు కేటాయించిన క్వారీ పరిమితికి మించి తవ్వకాలు జరపడంతో పాటు, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర భూముల్లోనూ అక్రమ మైనింగ్‌కు పాల్పడింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో గూడెం మధుసూదన్‌రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. ఈ అక్రమ మైనింగ్ వల్ల రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రూ. 39.08 కోట్ల నష్టం వాటిల్లింది. అయితే నిందితులు ఈ అక్రమ కార్యకలాపాల ద్వారా సుమారు రూ. 300 కోట్లు లబ్ధి పొందారని వెల్లడైంది. పోలీసుల దర్యాప్తు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో గతంలోనే సోదాలు నిర్వహించి, కీలక ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకుంది. సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థకు కేటాయించిన మైనింగ్ లైసెన్సును మధుసూదన్‌రెడ్డి, జి. విక్రమ్‌రెడ్డి భాగస్వాములుగా ఉన్న జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్‌కు సబ్-కాంట్రాక్టుకు ఇచ్చారు. ఈ విధంగా లైసెన్సును బదిలీ చేయడం నిబంధనల ప్రకారం చెల్లదని ఈడీ పేర్కొంది.

## శ్రీవారి ఆలయం నుండి శ్రీ పద్మావతి అమ్మవారికి సారె

తిరుచానూరు నవంబర్ 25,


శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం నాడు పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె ను ఊరేగింపుగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. ప్రతి ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా శ్రీవారి ఆలయంలో ఉదయం 2.30 నుండి పరిమళాన్ని(నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి,




కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం) విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. ఆ తరువాత ఉదయం 4.30 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడిన సారె ఊరేగింపు మొదలైంది. సారెను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సారెను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. అనంతరం కాలినడకన తిరుమల నుంచి తిరుపతిలోని అలిపిరి వద్దకు తీసుకెళ్లారు. అక్కడినుండి కోమలమ్మ సత్రం, శ్రీ కోదండరామాలయం, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, లక్ష్మీపురం సర్కిల్, శిల్పారామం నుండి తిరుచానూరు పసుపు మండపం మీదుగా ఆలయం వద్ద అమ్మవారికి సారె సమర్పించారు. ఆభరణంతో కూడిన శ్రీవారి సారెను అలిపిరి వద్ద అదనపు ఈవో వెంకయ్య చౌదరి జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు.

## హస్తినపై మనస్సులో.. అమరావతిలో తనువు

ఏలూరు, నవంబర్ 25,



డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎమ్మెల్యే పదవి పట్ల సంతృప్తిగా లేరు. ఆయన చూపంతా హస్తినపైనే ఉంది. గత ఎన్నికల సమయంలో రఘురామ కృష్ణరాజు నరసాపురం పార్లమెంటు టిక్కెట్ కోసం చివర వరకూ ప్రయత్నించారు. అయితే అది బీజేపీ కోటాలోకి వెళ్లిపోవడంతో ఆయనకు ఎక్కడో ఒకచోట స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉండి శాసనసభ నుంచి టీడీపీ పోటీ చేయించింది. గెలిచిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించింది. కేబినెట్ ర్యాంకు పదవి అయినప్పటికీ ఆయన మనసంతా ఢిల్లీపైనే ఉంది. వచ్చే ఎన్నికల నాటికి తాను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లే కనపడుతుంది. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.అయితే అప్పటికే ఉండి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంతెన రామరాజు ను ఒప్పించి రఘురామ కృష్ణరాజుకు టీడీపీ నాయకత్వం ఆ సీటును కేటాయించింది. మంతెన రామరాజుకు నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. ఆయనను ఏపీఐఐసీ ఛైర్మన్ గా నియమించింది. అయితే అక్కడ జనసేన లో కూడా కొంత అసంతృప్తి కనపడుతుంది. ఉండి నియోజకవర్గం తమకు కావాలని గత ఎన్నికల్లోనే జనసేన గట్టిగా పోరాడింది. అయితే రఘురామ కృష్ణరాజు కోసమే కాకుండా,టీడీపీ సిట్టింగ్ సీటు కావడంతో జనసేకు ఇవ్వలేదు. ఉండి జనసేన ఇన్ ఛార్జి నాగరాజుకు ఇప్పటి వరకూ ఎలాంటి పదవి దక్కకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. నాగరాజు శెట్టి బలిజ సామాజికవర్గం నేత కావడంతో ఆయన తన అసంతృప్తిని సన్నిహితుల ముందు వెళ్లగక్కుతున్నారట.మరొకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాత్రం వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయడానికి పెద్దగా ఇష్టపడటం లేదు. రఘురామ కృష్ణరాజుకు రాష్ట్ర రాజకీయాల కంటే ఢిల్లీలో ఉండటమే ఎక్కువగా ఇష్టపడతారు. ఆయన ఈసారి గట్టిగా తనకు టిక్కెట్ కావాలని పట్టుబడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నరసాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారని తెలిసింది. ప్రస్తుతం నరసాపురం ఎంపీగా ఉన్న శ్రీనివాసవర్మ కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారు. అయితే ఆయనను తప్పించి రఘురామ కృష్ణరాజుకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తారా? అన్నది సందేహమే అయినప్పటికీ ఈసారి టీడీపీ కోటాలో నరసాపురం తనకు కేటాయించాలని రఘురామ కృష్ణరాజు పట్టుబట్టే అవకాశముందంటున్నారు

## చెత్తను వేయకుండా సూపర్ ప్లాన్

విశాఖపట్టణం, నవంబర్ 25,

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో దీనిని అమలు చేస్తోంది. చెత్త వేసే ప్రదేశాలను శుభ్రపరిచి.. దేవుడి ఫోటోలు, మొక్కల కుండీలు, ముగ్గులు ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఆ ప్రదేశంలో మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇది మంచి ఫలితాలు ఇవ్వటంతో త్వరలోనే విశాఖ నగరం మొత్తం అనుసరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.వీధుల్లో నడిచివెళ్లేటప్పుడూ.. కొన్నిసార్లు గోడలపై గమనించే ఉంటారు.. ఇక్కడ మూత్రం పోసిన వాడు గాడిద. ఇక్కడ చెత్త వేస్తే శిక్షార్హం.. అంటూ కొటేషన్లు, హెచ్చరిక బోర్డులు గమనించే ఉంటారు. ఎవరెన్ని కొటేషన్లు రాసినా.. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొంతమంది మాత్రం పద్ధతి మార్చుకోరు. పరిశుభ్రతతో పనిలేదు.. అధికారుల హెచ్చరికలతో అస్సలు అవసరం లేదు.. తమ పంథా తమదే.. తమ పని తమదే. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. చెత్త వేసేస్తూ ఉంటారు. ప్రభుత్వం ఇంటింటికీ చెత్త సేకరణ జరుపుతున్నా.. చెత్త కుండీలు ఏర్పాటు చేసినా కూడా ఇలాంటి వారిలో మార్పులు ఆశించడం అత్యాశే అవుతోంది. కాలనీలలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్తను పారబోస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్నారు. అలాంటి చోట్ల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి వారిలో ఎలాంటి మార్పూ లేదు.దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఓ సరికొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. ఎక్కడైతే వ్యర్థాలను పారేస్తున్నారో అలాంటి ప్రదేశాలను గుర్తించి.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తున్నారు. ఆ తర్వాత దేవుడి ఫోటోలు పెట్టి.. ముగ్గులు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల కుండీలలో మొక్కలు ఉంచుతున్నారు. ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ఈ పద్ధతి అనుసరించగా సత్ఫలితాలు వచ్చాయి. అందుకే విశాఖపట్నం నగరం మొత్తం ఈ విధానం అనుసరించాలని జీవీఎంసీ ఆలోచనలు చేస్తోంది. దేవుడి ఫోటోలు పెట్టడం, ముగ్గులు పెట్టటంతో చెత్త వేసేవారిలో మార్పు వస్తోంది. తమ చర్యలను విరమించుకుంటున్నారు. దీంతో విశాఖపట్నం మొత్తం ఈ కార్యక్రమం అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డులో ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్?9లో ఇటీవల జీవీఎంసీ ఈ కార్యక్రమం నిర్వహించింది. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పరిసరాలను నిర్వహించడంపై స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్పొరేటర్ గోలగాని మంగవేణి ప్రజలు తమ పరిసరాలను చెత్త లేకుండా ఉంచుకోవాలని కోరారుచెత్త వేసే ప్రాంతంలో శుభ్రం చేసి ముగ్గులు వేశారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారేసే వారిపై కఠినమైన జరిమానాలు విధిస్తామని జీవీఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అలా కాదని నిబంధనలు అతిక్రమించి చెత్త వేస్తే వేయి రూపాయలు జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు.

================

## మయన్మార్లో 3.8 తీవ్రతతో భూకంపం

న్యూఢిల్లీ నవంబర్ 25, మయన్మార్లో సోమవారం సాయంత్రం 3.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. సాయంత్రం 5:39 గంటలకు ఈ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం 139 కిలోమీటర్ల లోతులో, 24.96 డిగ్రీల ఉత్తర అక్షాంశం మరియు 95.12 డిగ్రీల తూర్పు రేఖాంశంలో కేంద్రీకృతమై ఉంది. ఈ సమాచారాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ చీ ద్వారా వెల్లడించింది.

## ఏపీలో మ్యాజిక్ డ్రెయిన్స్

ఏలూరు, నవంబర్ 25,

పల్లెల్లో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 106 గ్రామ పంచాయతీలలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. తొలివిడతగా 59 కిలోమీటర్ల మేరకు ఈ మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరగనుంది. తక్కువ ఖర్చు, దుర్వాసన లేకపోవటం, మెరుగైన నిర్వహణ వంటి కారణాలతో ప్రభుత్వం సిమెంట్ డ్రెయిన్ల బదులుగా మ్యాజిక్ డ్రెయిన్ల వైపు మొగ్గు చూపుతోంది. ఏపీలో ఇప్పటికే కొన్నిచోట్ల వీటి నిర్మాణం జరిగింది. అక్కడ మంచి ఫలితాలు వస్తూ ఉండటంతో మరికొన్ని చోట్ల నిర్మించనున్నారు.పల్లెలలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్ర వాతావరణం ఏర్పాటు చేసే దిశగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని 106 గ్రామ పంచాయతీలల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. గ్రామీణాభివృద్ధి శాక చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ఈ విషయాన్ని వెల్లడించారు. 106 గ్రామపంచాయతీల పరిధిలో 59 కిలోమీటర్ల మేరకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలలో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అందులో భాగంగానే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. ఇవి సత్ఫలితాలు ఇస్తూ ఉండటంతో 106 గ్రామపంచాయతీలలో వీటిని నిర్మించాలని భావిస్తున్నారు. తొలి విడతగా 59 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. మూడు నెలల తర్వాత మ్యాజిక్ డ్రెయిన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు భావిస్తు?న్నారు.మరోవైపు మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలకు.. తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. అలాగే దుర్వాసన, దోమలు, కాలుష్యం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు. ఇక ఆర్థికంగానూ ఇది మంచి పరిష్కారం




కానుంది. ఒక కిలోమీటర్ మేరకు సిమెంట్ డ్రెయిన్ నిర్మించాలనే సుమారుగా రూ. 50 లక్షలు ఖర్చు అయితే.. ఈ మ్యాజిక్ డ్రెయిన్లు అయితే రూ.7.5 లక్షలకే పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. అలాగే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి తక్కువ స్థలం సరిపోతుంది. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వచ్చే అవకాశం ఉండదు.మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం కోసం తొలుత 2 అడుగుల లోతు, అరమీటర్ వెడల్పు ఉండేలా ఓ కాలువను తవ్వుతారు. అందులో తొలుత అడుగు మేర కొండరాయితో నింపుతారు. దాని పైపొరలో గులకరాళ్లు 8 అంగుళాల మేర నింపుతారు. దాని మీద కంకర రాళు 4 అంగుళాల మేరపరుస్తారు. చివరిగా గండ్ర ఇసుక పోస్తారు. ఇలా మూడు పొరలతో ఈ మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు. డ్రెయిన్ మధ్యలో 50 మీటర్లకు ఓసారి ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తారు. దీంతో మురుగునీరు నేలలోకి ఇంకుతుంది, అలాగే భూగర్భ జల స్థాయిలను మెరుగుపరుస్తుంది. వీటితో పాటుగా భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిపోకుండా ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

## విశాఖపట్నంలో కొత్త జోష్


విశాఖపట్టణం, నవంబర్ 25

విశాఖపట్నంలో పర్యాటకుల సందడి అమాంతం పెరిగింది. ఐటీ, పరిశ్రమల రాకతో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. వారాంతాల్లో బీచ్‌లు కళకళలాడుతున్నాయి. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ యాక్టివిటీస్ ఊపందుకున్నాయి. కార్డేలియా లగ్జరీ షిప్ రాకతో పాటు, హెలీ టూరిజం, గోల్ఫ్ కోర్సులు, స్నో పార్కులు వంటి అనేక ఆకర్షణలు రానున్నాయి. విశాఖను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.విశాఖపట్నంలో పర్యాటకుల సందడి పెరిగింది. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు రావడంతో నగరంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ముఖ్యంగా వారాంతాల్లో బీచ్‌లు సందర్శకులతో కళకళలాడుతున్నాయి. దేశ విదేశాల నుంచి కుటుంబాలు ఇక్కడికి వస్తున్నాయి. బీచ్‌లకు మాత్రమే పరిమితం కాకుండా, కొత్త రకాల పర్యాటకాన్ని పరిచయం చేయడానికి సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో నగరంలో వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ యాక్టివిటీస్ మరింత ఊపందుకున్నాయి.ఈ డిసెంబరులో కార్డేలియా లగ్జరీ షిప్ విశాఖపట్నం రానుంది. ఈ షిప్ రెండు, మూడు రోజుల పాటు విశాఖపట్నం క్రూజ్ టెర్మినల్‌లో నిలుపుతారు. విశాఖ-చెన్నై-అండమాన్ మధ్య నడిచేలా ప్యాకేజీలను ప్రణాళిక చేస్తున్నారు. ఇది అమల్లోకి వస్తే, ఈ షిప్ తరచుగా రాకపోకలు సాగిస్తుంది. విశాఖ తీరం వాటర్ గేమ్స్‌కు అనుకూలంగా ఉంటుంది. అందుకే సర్ఫింగ్, స్కూబా డైవింగ్, కయాకింగ్ వంటి వాటిపై ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. వీకెండ్‌లో ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో వీటి గురించి సెర్చ్ ఎక్కువగా ఉందట. రుషికొండ, భీమిలి, సాగర్‌నగర్ వంటి ప్రాంతాల్లో మరికొన్ని వాటర్ గేమ్స్ ఏర్పాటు చేయనున్నారు.అడ్వంచర్ గేమ్స్‌తో పాటుగా విశాఖపట్నం, అరకు ప్రాంతాల్లో హెలీ టూరిజం మళ్లీ ఊపందుకోనుంది. ఈ కొత్త హెలీ టూరిజం ప్రాజెక్టులో భాగంగా, గోల్ఫ్ కోర్సులు, స్నో పార్కులు, గోకార్టింగ్, మ్యూజియాలు, వాటర్ పార్కులు, థీమ్ బేస్డ్ పార్కులు వంటి అనేక ఆకర్షణలు రానున్నాయి. అంతేకాకుండా, హైథ్రిల్ రైడ్స్, జిప్‌లైన్, జెయింట్ స్వింగ్స్ వంటి సాహస క్రీడలు కూడా అందుబాటులోకి వస్తాయి. ఈ కార్యక్రమాలన్నీ పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేలా రూపొందిస్తున్నారు.గతంలో వీఎంఆర్‌డీఏ హెలీ టూరిజం నడిపినప్పుడు, నగరం చుట్టూ తిరగడానికి టికెట్ ధర రూ.2,500గా ఉండేది. అరకులో కూడా పర్యటించేలా అప్పట్లో ఆలోచనలు కూడా చేశారు. విశాఖ ఉత్సవ్‌లో ఈ సేవలు కొనసా?యి.. కానీ ఆ తర్వాత నిలిచిపోయాయి. ఇప్పుడు విహంగ్ అడ్వంచర్స్ సంస్థతో ఒప్పందం కుదరడంతో, మళ్లీ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇది పర్యాటక రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని భావిస్తున్నారు.విశాఖపట్నం అడ్వంచర్ గేమ్స్‌కు అనుకూలమని భావిస్తున్నారు. అందుకే ఇప్పటికే అక్కయ్యపాలెం దగ్గర అడ్వెంచర్ థ్రిల్ సిటీ నడుస్తోంది. విశాఖపట్నం మాత్రమే కాదు విజయవాడలోని భవానీ ఐలాండ్‌లో థ్రిల్ సిటీని పీపీపీ విధానంలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం స్థలం కూడా కేటాయించింది. విశాఖపట్నంలో వాటర్‌స్పోర్ట్స్, ప్రొఫెషనల్ గోకార్టింగ్ ఎరీనా ఏర్పాటు చేసే దిశగా ప్లాన్ చేస్తున్నారు. మొత్తం మీద విశాఖపట్నానికి పర్యాటకుల్ని ఆకర్షించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాబోయే రోజుల్లో సాగర తీర నగరంలో పర్యాటకులతో మరింత సందడి కనిపించనుంది.

## భారత్‌కు మాస్కో బంపరాఫర్

న్యూఢిల్లీ, నవంబర్ 25,

ఇండియాకు ముడి చమురు ఎగుమతి చేస్తున్న రష్యా కంపెనీల మీద అమెరికా.. తన అక్కసు వెళ్లగక్కడమే కాక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అమెరికా చర్యల వల్ల ఇండియాకు ముడి చమురు దిగుమతులు భారీగా తగ్గుతాయనే ఆందోళన వ్యక్తం అవుతోన్న నేపథ్యంలో.. మాస్కో ఇండియాకు బంపరాఫర్ ప్రకటించింది. ముడి చమురు దిగుమతుల మీద రెండేళ్లలో ఎన్నడు లేనంత రీతిలో భారీ స్థాయిలో డిస్కౌంట్ ప్రకటించింది. బ్యారెల్ మీద 7 డాలర్ల డిస్కౌంట్ ప్రకటిస్తూ రష్యా నిర్ణయం తీసుకుంది.



భారత్ రష్యా నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై అక్కసు వెళ్లగక్కుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కొద్ది రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. రష్యా చమురు కంపెనీలపైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్ సంస్థలతో పాటు వాటి అనుబంధ కంపెనీలపై డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సంస్థలతో భాగస్వామ్యం కలిగిన కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. అలానే సమీప భవిష్యత్తులో భారత్‌కు ముడి చ దిగుమతులు మరింత పడిపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఆంక్షల నేపథ్యంలో రష్యా భారత్‌కు బంపరాఫర్ ప్రకటించిది. రెండేళ్లలో ఎన్నడు లేనంత తక్కువ ధరలకే.. ఇండియాకు ముడి చమరురును అందించేందుకు మాస్కో రెడి అయ్యిందిఈక్రమంలో రష్యా కీలక ప్రకటన చేసింది. ఇండియా రిఫైనర్లకు యూరల్స్ ధర డెలివరీ ప్రాతిపదికన.. డేటెడ్ బ్రెంట్‌తో పోలిస్తే.. బ్యారెల్ మీద సుమారు 7 డాలర్లు వరకు తగ్గింపు ప్రకటించింది. అయితే ఈ ఆఫర్ ఇప్పటి నుంచి వర్తించదు. డిసెంబరులో లోడ్ చేసి.. 2026, జనవరిలో ఇండియాకు చేరే కార్గోల మీద ఈ డిస్కౌంట్ ఆఫర్ వర్తించనుంది. అమెరికా ఆంక్షలు విధించడానికి ముందు యురల్స్.. ఒక్క బ్యారెల్ మీద సుమారు మూడు డాలర్ల వరకు డిస్కౌంట్ ఆఫర్ ఇచ్చింది. ఇప్పుడు దీన్ని ఏడు డాలర్లకు పెంచడం మరింత శుభపరిణామం అంటున్నారు.రోస్‌నెఫ్ట్, లుకోయిల్ సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు అమలులోకి రావడంతో.. భారత రిఫైనర్లు రష్యన్ సంస్థల వద్ద నుంచి చమురు ఆర్డర్లను భారీగా తగ్గించాయి. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత నుంచి ఇండియా.. మాస్కో నుంచి చౌకైన చమురును విస్తృతంగా దిగుమతి చేసుకుంది. కానీ అమెరికా ఆంక్షల కారణంగా ఇప్పుడు దిగుమతి నిలిపి వేసింది.రోస్‌నెఫ్ట్, లుకోయిల్ సంస్థల మీద మాత్రమే కాక గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాస్ కంపెనీల మీద అమెరికా ఆంక్షలు విధించింది. ఈక్రమంలో ఇండియా రిఫైనర్లు.. ప్రస్తుతం రష్యా వద్ద నుంచి కాక.. మధ్యప్రాచ్యం సహా ఇతర ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ముడి చమురును కొనుగోలు చేస్తున్నాయి. రష్యా చమురు ధరల మీద భారీ స్థాయిలో డిస్కౌంట్ ప్రకటించడం వల్ల భారత్‌కు తాత్కాలికంగా లాభం కలిగించవచ్చు. కానీ రష్యా కంపెనీల మీద అమెరికా ఆంక్షల కారణంగా సరఫరా స్థిరత్వం అనిశ్చితంగా మారింది. రిఫైనర్లు తక్కువ ధరల వల్ల రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి రెడీ అవుతున్నప్పటికీ.. దీర్ఘకాలంలో.. అమెరికా ఆంక్షలు దీన్ని మరింత క్లిష్టతరం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కనుక ఈ డిస్కౌంట్ ఆఫర్ వల్ల ఇండియాకు పెద్దగా లాభం ఉండబోదని అభిప్రాయపడుతున్నారు.

# అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## పోలీస్ శాఖ నుంచి రక్షణ చర్యలు చేపడుతున్నాం: కరీంనగర్ సిపి గౌష్ ఆలం

కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సిపి గౌష్ ఆలం, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ.. భద్రత చర్యలు అనే అంశంపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలు అధికంగా అవుతున్న ప్రాంతాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, సిపి తో చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారించేందుకు పోలీస్ మున్సిపల్ నేషనల్ హైవే ఆర్ అండ్ బి ఆర్ టి సి అధికారులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. వాహనదారులు ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ తారకమంత్రమని, పరిసరాలను గమనిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో వాటి నియంత్రణకు భద్రత చర్యలు చేపడతామన్నారు. ఇందుకు అవసరమైన చోట ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సంవత్సరం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలనీ, అందుకు అవసరమైన పనులు చేపట్టేందుకు అనుమతిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా కరీంనగర్ జిల్లాను అధికారులంతా సమిష్టిగా తీర్చిదిద్దాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు

బహుముఖ వ్యూహంకరీంనగర్ సిపి గౌష్ ఆలం

జిల్లాలో ఆయా రహదారులపై రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించేందుకు పోలీస్ శాఖ తరఫున బహుముఖ వ్యూహం అమలు చేస్తున్నామని, ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ సిపి గౌష్ ఆలం పేర్కొన్నారు.

కరీంనగర్ టు హైదరాబాద్ వరంగల్ టు జగిత్యాల సిరిసిల్ల నుండిచొప్పదండి టూట్ లో రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. రహదారుల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించామని రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీస్ శాఖ నుంచి పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని దీనివల్ల కొంతవరకు రోడ్డు ప్రమాదాలు నివారణకు కృషి చేశామని చెప్పారు. ఈ ప్రమాదాలకు ముఖ్య కారణం అతివేగం నిర్లక్ష్యంగా మద్యం తాగి డ్రైవింగ్ చేయడమేనని తెలిపారు. కరీంనగర్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అన్ని పనిచేసేలా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎక్కడ ఏం అవసరం ఉన్నా అధికారులు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. కళాశాల విద్యార్థులు స్కూల్ పిల్లలు ఎవరైనా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా అనుమతించ బడిన వేగం వరకే వాహనాలు నడపాలని అతివేగంగా, రాంగ్ రూట్లో వాహనాన్ని నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ ను తప్పకుండా పాటించాలని హెల్మెట్ ను ధరించాలని తెలియజేశారు. ప్రతిరోజు వెహికల్ చెకింగ్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి వాటిని గుర్తించి వారికి ఫైన్ విధిస్తున్నామని తెలిపారు. అదే విధంగా రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేయకుండా నిర్దేశించిన ప్రదేశంలో పార్కింగ్ చేయడం ద్వారా ట్రాఫిక్కు అంతరాయం ఉండదని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారణకే డిజిపి శివదర్ రెడ్డి అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా చేపడుతున్నామని సిపి తెలిపారు..జాతీయ రహదారిపై




పరిమితికి లోబడి వాహనం వేగం ఉండాలని పరిమితికి మించి వాహనాన్ని నడిపినట్లయితే స్పీడ్ గన్ ద్వారా గుర్తించి సిబ్బంది జరిమానా వేస్తామని చెప్పారు. వాహన దారులు కచ్చితంగా వాహనానికి సంబంధించిన కాగితాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి ఏసీపీలు విజయకుమార్, వెంకటస్వామి శ్రీనివాస్ జి, యాదగిరి స్వామి, సిఐలు ఎస్సైలు అధికారులు పాల్గొన్నారు.

---

## దేశానికి ఒక వెలుగు రాజ్యాంగం

దేశానికి దిక్సూచి మన రాజ్యాంగం
అణగారిత నుండి సమాజానికి నాగరికత నేర్పిన గ్రంథం
చీకటిని పారదోలి ఒక వెలుగును నింపిన రాజ్యాంగం
దేశమనే దేహానికి గుండె లాంటి రాజ్యాంగం!!

దేశ నడవడిక దేశ ప్రగతికి రాజ్యాంగం
ప్రజలకు ప్రజాస్వామ్యానికి రక్షణ కల్పించేది
ప్రజాస్వామ్యానికి ప్రజలకు పవిత్ర గ్రంథం
హక్కులను రక్షించేది దేశ సంపద రాజ్యాంగం!!
భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పవిత్ర గ్రంథం
భావితరాలకు బాట రాజ్యాంగం
రాజ్యాంగంతో అందరికీ సమన్యాయ పాలన
రాజ్యాంగంతో అందరికీ సమన్యాయ అవకాశాలు

అందరికీ పవిత్ర గ్రంథం రాజ్యాంగం
మన రాజ్యాంగాన్ని మనం గౌరవిద్దాం
మన రాజ్యాంగాన్ని మనమే కాపాడుకుందాం!!



దేవులపల్లి రమేశ్
సిద్దిపేట, నంగునూర్
9963701294

---

## జాతీయ స్థాయి మ్యూజిక్ పోటీలలో పారమిత విద్యార్థులు

కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

ఈ నెల 20 వ తేదీ న మహారాష్ట్ర శంభాజీనగర్ లోని స్టెప్పింగ్ స్టోన్ విద్యాసంస్థ ల ఆధ్వర్యంలో జరిగిన ఫాజిల్ అబ్బాస్ ఫెస్టివల్ 2025-26 జాతీయ స్థాయి పోటీలలో నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల కు చెందిన రాక్ బ్యాండ్ బృందం క్లాష్ ఆఫ్ కోర్డ్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ ని కనబరిచి



జాతీయస్థాయిలో రెండవ బహుమతి గెల్చుకున్నారని డైరెక్టర్ హన్మంత రావు తెలిపారు.

ఈ పోటీలలో 7 వ తరగతి కి చెందిన శ్రేయాన్స్ కార్తికేయ , కె. చరణ్ , 8 వ తరగతికి చెందిన సోనాక్షి, 9 వ తరగతికి చెందిన యస్. శ్రీ సాన్విక , కె. శ్రీ వికాస్, కె. వైష్ణవి, కె. తనీష్ , బి. శాశ్విత లు క్లాష్ ఆఫ్ కోర్డ్స్ బృంద విభాగం లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండవ బహుమతి పొందారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి లో బహుమతి పొందిన విద్యార్థులను, సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ, కిరణ్ లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

---

## అవార్డు పొందినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 25 (భారత శక్తి): జలసంచాయ్%-%జనభాగీదారీ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా స్వీకరించిన సందర్భంగా, గురువారం సాయంత్రం కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు.



జిల్లాకు ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డు లభించడం పట్ల ఎస్పీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ"జిల్లా అభివృద్ధి దిశగా ఇటువంటి విజయాలు మరింత వేగం తీసుకొస్తాయి. ముమ్మందు ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ, జిల్లా ప్రతిష్టను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తాం" అని తెలిపారు.

---

## 2026జనవరి 1నుండి 4వరకు సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్25:

2026 జనవరి 1 నుండి 4వ తేదీ వరకు సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించబడతాయని సంస్థ కన్వీనర్ డి.ఎస్.ఎన్ మూర్తి, అప్పా జోశ్యుల సత్యనారాయణ లు అన్నారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ అజో విభూ కందాలం ఫౌండేషన్ (అమెరికా), సహృదయ వరంగల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు హన్మకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించబడతాయని, ఇవి మాత్రమే కాకుండా మూడు రోజులు ప్రత్యేకంగా ఉభయ రాష్ట్రాల నుండి ఎంపిక చేసిన తెలుగు కథానాటకాలు ప్రదర్శనలు ఉంటాయని



ప్రతిరోజు మూడు నాటకాలు మొత్తం తొమ్మిది నాటకాలు ఉంటాయని, రంగస్థల సేవ చేసిన ఒక వ్యక్తికి పదివేల రూపాయలు రంగస్థలం పురస్కారం ఉంటుంది అని అన్నారు. ముగ్గురికి సాహిత్య పురస్కారం అందిస్తున్నామని1.డాక్టర్ జి. వి. రత్నం ,వరంగల్. ( విశ్రాంత ఉపన్యాసకులు సికేఎం రచయిత)2026 సంవత్సరం- ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం క్రింద ఒక లక్ష రూపాయలు సన్మానం ఉంటుంది. 2. రామా చంద్రమౌళి - వరంగల్( కవి, కథకుడు, నవలా రచయిత)2026 సంవత్సర, విశిష్ట సాహితీ మూర్తి,జీవితకాల సాధన పురస్కారం కింద 50వేల రూపాయలు, సన్మానం ఉంటుంది. 3. కోట్ల హనుమంతరావు- కళాకారులు సు.ప్ర. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కు సరిలేరు నీకెవ్వరు పురస్కారం కింద 25 వేల రూపాయలు, సన్మానం ఉంటుంది అని అన్నారు. పురస్కారం అందుకుంటున్న ప్రముఖులు ముగ్గురి సాహిత్యాల విశ్లేషణలు ప్రతిరోజు ఉదయం 10:30 నుండి 1:00 వరకు సాహిత్య సమాలోచన సదస్సులు ఉంటాయని అన్నారు. అందరూ ప్రజలు ఈ కార్యక్రమంలో తిలకించి ఈ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జి. గిరిజ మనోహర బాబు, వనం శ్రీకాంత్ రావు, ఏ.వి. నరసింహారావు, కె కృష్ణమూర్తి, నేలకొండ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

---

# రామాపురం డంపింగ్ యార్డులోని చెత్త నిర్వహణ త్వరగా పూర్తి చేయండి

## ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్. మౌర్య.




రామాపురం డంపింగ్ యార్డులోని చెత్త నిర్వహణ గడువులోపు త్వరగా పూర్తి చేయాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. రామాపురం వద్దనున్న లెగసీ వేస్ట్ డంపింగ్ యార్డును మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు లెగసీ వేస్ట్ ను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అధికారులు కలసి త్వరగా చెత్త నిర్వహణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశ లో అక్టోబర్ 2వ తేదీ నాటికి 2,21,000 మెట్రిక్ టన్నుల చెత్తను నిర్వహణ చేశారని తెలిపారు. రెండవ దశలో 65000 మెట్రిక్ టన్నుల చెత్త నిర్వహణను డిసెంబర్ 31 లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడువు లోపు చెత్త నిర్వహణ చేసేలా అధికారులు పరిశీలన చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ రమణ, చెత్త నిర్వహణ ప్లాంట్ నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

---

# గీతంలో మోహినియాట్టం పుస్తక పరిచయం

## - ప్రపంచ నలుమూలల నుంచి వర్చువల్ గా పాల్గొన్న 50 మంది అధ్యాపకులు, పరిశోధకులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 25:హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెన్ (జీఎస్ హెచ్ఎస్) మంగళవారం 'మోహినియాట్టం: ఎ రీడర్, 1%఑%2 ప్రతులను' పరిచయం చేయడానికి వర్చువల్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రపంచ నలుమూలల ఉన్న ప్రఖ్యాత ప్రొఫెసర్లు, పరిశోధకులు దాదాపు 50 మంది ఇందులో పాల్గొన్నారు. జీఎస్ హెచ్ఎస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మైథిలి మరాట్, ఐఐటీ భువనేశ్వర్ లోని మానవతావాద అధ్యయన విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కావ్య కృష్ణ ఈ పుస్తకానికి సంపాదకీయం వహించారు. తొలుత, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ తరు, నృత్య పరిశోధన యొక్క పరిధిని సాంకేతికత, సౌందర్యశాస్త్రం దాటి విస్తృతం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. జాతీయవాదం, వలసవాదానంతర, ఇతర సామాజిక-రాజకీయ చట్రాలతో దానిని అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పది మంది ప్రముఖ ప్యానలిస్టులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నృత్య పరిశోధనకు అభివృద్ధి చెందుతున్న విధానాల గురించి, సమకాలీన అజెండాల ద్వారా గతం యొక్క దృక్పథాలు ఎలా రూపొందించబడుతున్నాయో కొలంబియా విశ్వవిద్యాలయంలోని బర్నార్డ్ కళాశాల ప్రొఫెసర్ ఉత్తర ఆశా వివరించారు. మోహినియాట్టంలో తన పరిశోధన ఆధారిత దేశీ కచేరీ నుంచి అంతర్దృష్టులను సీనియర్ గురు నిర్మలా పనిక్కర్ పంచుకున్నారు. మోహినియాట్టం సంగీత సంప్రదాయాల అన్వేషణను కళాకారిణి-పండితురాలు డాక్టర్ దీప్తి ఓంచేరి వివరించారు.




తన అమ్మమ్మ వారసత్వాన్ని, ప్రపంచవ్యాప్తంగా నృత్య రూపాన్ని విస్తరించడానికి చేసిన ప్రయత్నాలను మూడవ తరం కళాకారాణి స్మిత రాజన్ విశదీకరించారు. కేరళ నుంచి కోల్ కతా వరకు మోహినియాట్టం ప్రయాణం, దాని సాంస్కృతిక పెరుగుదల గురించి ఫుల్ బ్రైట్ స్కాలర్ డాక్టర్ ప్రియదర్శిని ఘోష్ చర్చించారు. ఇతర వక్తలలో డాక్టర్ అనిషా రాజేష్ (హ్యూస్టన్), డాక్టర్ శ్వేత మంగళత్ (కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, యూకే), డాక్టర్ కె.అమిత్ (కేరళ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్), డాక్టర్ అశ్వతి రాజన్ (రాజగిరి కళాశాల) తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం అంతర్దృష్టితో కూడిన స్ఫూర్తిదాయకమైనదిగా మమతా వి. కుమార్ అభివర్ణించారు. మోహినియాట్టం యొక్క విస్తృతమైన, సమగ్ర అవగాహనను ఈ కార్యక్రమం ప్రదర్శించిందని మాళవిక అజికుమార్ ప్రశంసించారు. సవరించిన సంపుటాలు భారతీయ నృత్య పరిశోధనలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తాయి. ఇది మోహినియాట్టంపై తొలిసారిగా సమగ్ర అవగాహనను కల్పిస్తోంది. ముఖచిత్రాన్ని బాల కళాకారిణి అవంతిక అనూప్ రూపొందించగా, అవి ఒక ప్రత్యేకమైన, వ్యక్తిగత స్పర్శను ఈ ప్రచురణలకు జోడించాయి.

---

# మనస్సుంటే మార్గం ఉంటుంది.!

## -మన మల్లేష్ అన్నంటే సేవకుడు.!
## -మనిషి పేదవాడే.. గుణంలో గొప్పవాడు.!

బూర్గంపాడు, నవంబర్ 25 (భారతశక్తి):మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన యువకుడు నేటి తరానికి మాదిరిగా నిలుస్తున్నాడు. సమాజ సేవకుడు శనగ మల్లేష్ (బిటెక్ ఎలక్ట్రికల్ )తన పేరు చెబితే అందరికీ సుపరిచితుడే. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం తన గుణం శత్రువుని సైతం ప్రేమించగల మంచి మనసున్న వ్యక్తి. నిరుపేద కుటుంబంలో పుట్టిన తను పేదరికం ఆర్థిక ఇబ్బందులు అన్ని అనుభవించిన తను తనవంతుగా అనేకులకు ఉపయోగపడాలని ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. విలేఖరి వృత్తిలో కొనసాగుతూ మంచి ఆర్టికల్స్,యువత గురించి ప్రస్తుత సమాజంలో జరుగుతున్న విధి విధానాలు గురించి రాస్తూ సమాజానికి చక్కని సందేహాన్ని ఇస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెలియజేస్తూ అందరి ఆదరణ పొందుతూ సమాజంలో ముందుకు వెళుతున్నారు. సెనగ మల్లేష్ 2018 లో మొదటి కరోనా సమయంలో వచ్చిన సందర్భంలో ఏ రోజు పనిచేస్తే ఆరోజు పూటగడిచే వారి గురించి ఆలోచించి 125 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను సుమారు రూ.45 వేల సరుకులను కేజీ బియ్యం కేజీ కందిపప్పు కేజీ ఆయిల్ ప్యాకెట్ కేజీ గోధుమపిండి నిత్యావసర వస్తువులు తనతో పాటు చదువుకున్న స్నేహితుల సహకారంతో పంపిణీ చేశారు. ఎంతోమంది అనారోగ్యంతో బాధపడుతుంటే ఎంతో మందికి తనకున్న దాంట్లో వారికి సహాయం చేసి వారికి చేయూత,నేస్తం ట్రస్టుల ద్వారా సహాయం చేపించారు. చేయూత ట్రస్ట్ లో ఒక సభ్యుడుగా కొనసాగుతూ అనేకులకు సహకారిగా ఉంటూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ వస్తున్నాడు. సహాయము చేయాలంటే డబ్బుంటే సరిపోదు మంచి మనస్సు ఉండాలని మన మల్లేష్ ను చూసి నేర్చుకోవచ్చు. ఎవరికైనా సహాయం చేయాలంటే తన దగ్గర లేకపోయినా తన నమ్ముకొని వచ్చిన వారిని వేరే వాళ్ళ దగ్గరికి వెళ్లి సహాయం చేపించే మంచి గుణము కలిగిన వ్యక్తి తన ఉంటున్న కాలనీ లో కూడా అందరి చేత లేబర్ ఇన్సూరెన్స్ చేయించి, 25 మందికి ఉచిత గ్యాస్ కలెక్షన్స్ ఇప్పించడం,రేషన్ కార్డ్స్,ఓటర్ కార్డ్స్,యువత క్రీడల విషయంలో ప్రోత్సహిస్తూ,సహకరిస్తూ అనారోగ్యం తో బాధ పడుతున్న వారికి సహాయం చేస్తూ ట్రస్టు ల నుండి సహకారం అందిస్తూ అనేకుల ద్వారా కూడా వారికి ఆదుకోవడం ఇంకా అనేక కార్యక్రమాలు చేస్తూన్నారు. మల్లేష్ అందరితో నవ్వుతూ అందరిని ప్రేమిస్తూ తగ్గింపు గుణము కలిగి అందరూ ప్రేమా ఆదరణ పొందుతున్న సెనగ మల్లేష్ ఇంకా అనేకులకు సహకారిగా ఉండాలని దేవుడు మంచి ఆరోగ్యము ఇవ్వాలని ఇంకా అనేక సేవ కార్యక్రమాలు చేయాలనీ మనస్ఫూర్తిగా కోరుకుందాం.



## కామారెడ్డి జిల్లా కేంద్రంలో రామారెడ్డి రోడ్, వైష్ణవి ఆసుపత్రి సమీపంలోని శానిటేషన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25:



జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రహదారి, వైష్ణవి ఆసుపత్రి సమీపంలోని శానిటేషన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆ ప్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ, పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత పాటించి చెత్త ఉండకుండా వెంటనే శుభ్రత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఇంటింటి చెత్తను ప్రతీ రోజూ సేకరించాలని, ఎక్కడైనా చెత్త పేరుకు పోకుండా రోజువారీ పర్యవేక్షణ చేయాలని, ఆసుపత్రులు, రహదారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టాలని,చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేయకుండా పౌరుల ఆరోగ్యం, శుభ్రమైన పర్యావరణం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలంటూ, స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధన కోసం మున్సిపాలిటీ పూర్తి నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్ స్పెక్టర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలి: జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 25:



జిల్లాలోని బీసీ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ హాస్టల్స్‌ను మరింత మెరుగుపర్చడంలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని బీసీ అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం సంగారెడ్డి పట్టణం లోని బాలురవసతిగృహం విద్యార్థులకు , హాస్టల్ గడ్డ బీసీ బాలికల వసతి గృహం విద్యార్థులకు కిర్బీ సంస్థ, సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా స్టెయిన్లెస్ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్కూల్ బ్యాగులు, ట్రంక్ బాక్సులను, జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి విద్యార్థులకు అందజేశారు. జిల్లా లోని 34 బిసి హాస్టల్ విద్యార్థులకు కిర్బీ సంస్థ సిఎస్ఆర్ నిధులు 29.89 లక్షల రూ. ద్వారా అందించిన స్టెయిన్లెస్ స్టీల్ ప్లేట్లు (3102), గ్లాసులు (3102), స్కూల్ బ్యాగులు (1681), ట్రంక్ బాక్సులు (1681) వంటి వస్తువులను జిల్లా కలెక్టర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. వసతి గృహాల విద్యార్థుల కోసం నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అయితే సమాజం, సంస్థలు బాధ్యతగా ముందుకు వస్తే విద్యార్థుల భవిష్యత్తు మరింత బలోపేతం అవుతుంది అని తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణంలో కావడం కోసమే కార్పొరేట్ సంస్థల సహకారంతో ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు శాత శాతం ఉత్తీర్ణమి సాధించాలని, మంచి మార్కులు విద్యార్థులు సాధిస్తే మరోసారి వచ్చే విద్యార్థులకు ఘనంగా సన్మానించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ప్రావిణ్య ప్రసంగం విద్యార్థుల్లో ఉత్తేజం నింపింది. అనంతరం హాస్టల్ విద్యార్థులతో కలిసి ,వారి మధ్య కూర్చొని వాళ్లతో పాటు అల్పాహారం తీసుకున్నారు. వారి వసతి, భోజన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో ప్రత్యక్షంగా విద్యార్థిలను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భముగా బి సి సంక్షేమాధికారి జగదీశ్ మాట్లాడుతూ ... సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు కిర్బీ సంస్థ ద్వారా సిఎస్ఆర్ నిధులతో పంపిణీ చేసిన ఉపకరణాలు , విద్యా సౌకర్యాలకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ అభివృద్ధిలో భాగంగా ముందుకు వచ్చిన కిర్బీ సంస్థకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కిర్బీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజ మహేంద్ర , హెచ్ ఆర్ నాగరాజు , వార్డెన్ గౌసుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు , ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

## సదాశివనగర్ మండల కేంద్రంలో పాత చెరువులో

## 100శాతం రాయితీతో చేపల పిల్లల విడుదల చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25: ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ నాయకత్వంలో, మత్స్యకార శాఖ ఆధ్వర్యంలో సదాశివనగర్ మండల కేంద్రంలోని పాత చెరువులో ఉచితంగా 100 శాతం రాయితీతో చేపల పిల్లల విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గంగమ్మ తల్లి ఆశీస్సులతో పూజ నిర్వహించి చేపల పిల్లలను చెరువులో వదిలే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, ప్రతి మండల కేంద్రంలో మత్స్య మార్కెట్ యార్డు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాము. జిల్లా కలెక్టర్ కు ప్రతి మండల కేంద్రంలో 1000 గజాలు ప్రభుత్వ స్థలం మత్స్యకార మార్కెట్ యార్డ్ కు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. తద్వారా చేపల అమ్మకం సులభసాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఎల్లారెడ్డి మండలం మార్కెట్ యార్డ్ ప్రారంభం అయింది అని , సదాశివనగర్ మండల కేంద్రాల్లో మార్కెట్ యార్డు దాదాపు పూర్తి అయింది, ఏర్పాటు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. లింగంపేట్ మండలంలో కూడా చేపల మార్కెట్ యార్డు కోసం భూమిని గుర్తించినట్టు చెప్పారు. అన్ని మండల ప్రధాన కేంద్రాల్లో ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## రామారెడ్డి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ప్రెస్ మీట్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25: రామారెడ్డి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చీరల పంపిణీ పై మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డితో కలిసి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగినది. డ్వాక్రా మహిళలకు మాత్రమే చీరలు పంపిణీ చేయటం ఎంత వరకు సమంజసం డ్వాక్రా గ్రూప్ లో ఉన్న మహిళలు మాత్రమే మహిళల గ్రూప్ లో లేని వారు మహిళలు కాదా అని ప్రశ్నించటం జరిగినది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలయిన ఇప్పటివరకు బతుకమ్మ పండగకు ఒక్కసారి కూడా చీరల పంపిణీ చేయడం జరగలేదు. మండలంలో 12 వేల మంది మహిళలు ఉండగా కేవలం 7500 చీరలు మాత్రమే మండలానికి రావడం జరిగింది. సుమారు ఇంకా 40 శాతం చీరలు రావలసి ఉంది, మండలంలో ప్రతి మహిళకు చీరలు ఇవ్వవలెనని లేనియెడల బి ఆర్ ఎస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మైనారిటీలకు గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రంజాన్ తోపాటు, క్రిస్టియన్స్ కు



క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ కానుక కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత మోసపూరితమైన హామీలు ఇచ్చి ఏ ఒక్కదానిని కూడా నెరవేర్చలేక పోతున్నది. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతూ ఉంటుంది అని చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నర్సారెడ్డి, రైతు బంధు మాజీ జిల్లా డైరెక్టర్ రాజేందర్, మాజీ ఏఎంసి డైరెక్టర్ సిద్ధ రాములు, బాల్ దేవ్ అంజయ్య, జంగం లింగం, హన్మోళ్ల రాజయ్య, ఇసాయిపేట బైరయ్య, బాలమల్లు, దుబ్బాక లక్ష్మణ్, కుశనుల్లా రాజు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి 20,000 ఆర్థిక సాయం అందజేసిన టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25: మంగళవారం కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లికి చెందిన



గొర్రెల కాపరి సుధాకర్ గత రెండు రోజుల క్రితం చనిపోగా, వారి కుటుంబాన్ని పరామర్శించి 20,వేల రూపాయలు వారి కుటుంబానికి టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి 20వేల రూపాయలు ఆర్థికఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబానికి చదువుకోడానికి పిల్లలకు నా వంతు సహాయ సహకారాలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, మాజీ మున్సిపల్ చైర్మన్, మామిళ్ళ అంజయ్య, నిమ్మ విజయ్ రెడ్డి, వీరన్న పటేల్, తాజా మాజీ కౌన్సిలర్లు, ఊర్దొండ రవి, చాట్ల వంశీ, పంపరి శ్రీనివాస్ రావు, గడ్డమీది మహేష్, మామిల్ల రమేష్, రంగ రమేష్, నవీన్, రవి పటేల్, యూత్ నాయకులు, ఆబిద్, ఇమ్రాన్, బల్ల శ్రీనివాస్, కిరణ్, నర్సుల మహేష్, మున్నా, శశి, శ్రీకాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### -5 కోట్ల 66లక్షల వడ్డీలేని రుణాలు చెక్కులు పంపిణీ

### -రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం

కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి): తెలంగాణ ప్రగతి మహిళా సంఘాలకు 304 కోట్ల రూపాయలు వడ్డీలేని రుణాలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందనీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని 7 మండలాలకు రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మంగళవారం హైదరాబాదులోని అధికారిక నివాస గృహంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు అందించారు. హుస్నాబాద్ లోని 7 మండలాల్లోని 5329 స్వయం సహాయక సంఘాలకు 5 కోట్ల 66 లక్షల 16 వేల రూపాయల వడ్డీ రుణాలను అందజేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్ మండలాల సంఘాలకు 1524 1.72, 821 సంఘాలకు 86 లక్షలు, 703 మహిళా సంఘాలకు 86 లక్షల రూపాయలు వడ్డీలేని చెక్కులను అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వడ్డీలేని రుణాలు పొందిన మహిళా సంఘాలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలకు బ్యాంకర్లు మహిళా సంఘాలకు అందజేయడం శుభపరిణామం అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనీ ఆకాంక్షించారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం ఎన్ని కోట్లు అయినా రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉ



ందన్నారు. 18 సంవత్సరాల నిండిన మహిళలందరూ సంఘాల్లో సభ్యత్వం తీసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. మహిళలకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందనీ, ప్రజా పాలన ప్రభుత్వం ఆడబిడ్డలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

## తెలంగాణలో నాసిరకం చెక్ డ్యాంల నిర్మాణం

### -ధ్వంసమైన డ్యాంలపై సమగ్ర విచారణ చేపట్టాలి

### -సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి బహిరంగ లేఖ

కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

నీళ్లు-నిధులు-నియామకాలతోనే స్వరాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు దాటినా నేటికీ అన్యాయమే జరుగుతుంది. రూ.లక్ష కోట్లకుపైగా వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సంగతి ఏమైందో, ప్రజాధనం ఏ విధంగా దుర్వినియోగమైందో మీతో సహా రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. రాష్ట్రంలో చెక్ డ్యాంల నిర్మాణం పేరుతోనూ భారీ ఎత్తున అవకతవకలపై అరోపణలు వస్తున్నాయి. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో నిర్మించిన చెక్ డ్యాంల పరిస్థితి దారుణంగా తయారైంది. నాసిరకం పనులతో నిర్మించడంవల్ల ఇప్పటికే చాలా చోట్ల చెక్ డ్యాంలు కూలిపోయాయి. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం బహిరంగ లేఖ ద్వారా కోరారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల-గుంపుల వద్ద నిర్మించిన చెక్ డ్యాం ధ్వంసమైంది. 2021 లో వచ్చిన వరదల్లోనూ చాలావరకు కూలిపోయాయి. డిజైన్ లోపం, నాణ్యత సరిగ్గా లేని కారణంగా ప్రజాధనం నీటిపాలైంది. చెక్ డ్యాంల నిర్మాణ పనులపై ప్రజలు అనేక సందేహాలు లేవనెత్తుతూ అనేక ఫిర్యాదులు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చెక్ డ్యాంల నిర్మాణం, నిధుల చెల్లింపుపై ఈ ఏడాది మే నెలలో మీరే స్వయంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలో మానేరు నదిపై 57 చెక్ డ్యాంల నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.287 కోట్లు చెల్లించిన దానిమీద మీరు విజిలెన్స్ విచారణ చేయిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఆ విజిలెన్స్ విచారణ ఏమైందో నేటి వరకు అతీగతీ లేదు. గత బీఆర్ఎస్ పాలనలో చెక్ డ్యాం కాంట్రాక్టులను ప్రస్తుత కాంగ్రెస్ నాయకులే చేజిక్కించుకున్నారు. చెక్ డ్యాంల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించలేదు. కమీషన్లకు కక్కుర్తి పడి బీఆర్ఎస్ పాలకులు చెక్ డ్యాంల నిర్మాణ పర్యవేక్షణను గాలికి వదిలేయడంవల్లే ఈ దుస్థితి ఏర్పడింది. తనుగుల-గుంపుల వద్ద చెక్ డ్యాం కూలిపోవడంతో ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు దానికి బాధ్యులు మీరంటే మీరంటూ చెక్ డ్యాం లకు వద్దకు వచ్చి డ్రామాలాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో కమీషన్లకు కక్కుర్తి పడకుండా నాణ్యతా ప్రమాణాలపై దృష్టి పెట్టి ఉంటే చెక్ డ్యాంలు కూలిపోయే పరిస్థితి వచ్చేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అక్రమ ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తూ చెక్ డ్యాంల పరిరక్షణను గాలికొదిలేసింది. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ పార్టీలోని బడా నేతలు, ఎమ్మెల్యేలు సైతం ఇసుక అక్రమ దందా చేసన్తూ దోపిడీని దర్జాగా కొనసాగిస్తున్నారు. చెక్ డ్యాంల నాణ్యతపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం, కమీషన్ల కక్కుర్తివల్ల రైతులు గోసపడుతున్నారు. నీటి పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాల వల్ల సమీప పంట పొలాల రైతులకు సారవంతమైన నేల నిసారంగా మారి నష్టం జరుగుతోంది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని తనుగుల-గుంపుల చెక్ డ్యాం కూలివేతతోపాటు రాష్ట్రంలోని చెక్ డ్యాంల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలు, నాసిరకం పనులపై సమగ్ర విచారణ జరిపించాలి. చెక్ డ్యాంల కూలివేతకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నాణ్యాతా ప్రమాణాలు పాటించకుండా చెక్ డ్యాంల కూలిపోవడానికి కారకులైన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. నష్టపోయిన ప్రజధనాన్ని రాబట్టేందుకు సదరు కాంట్రాక్టర్ల ఆస్తులను జప్తు చేయాలి. తద్వారా తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదనే సంకేతాలను పంపినట్లవుతుంది. తక్షణమే ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో విచారణకు ఆదేశించాలని కోరుతున్నాను.

# ఇసుక మాఫియానే చెక్ డ్యామ్ లను కూల్చింది

## కట్టింది కేసీఆర్..కూల్చేది రేవంత్ రెడ్డా? తనుగుల వాగులో కూలిన చెక్ డ్యామ్ ను పరిశీలించి మీడియాతో హరీశ్ మండిపాటు

కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):



కేసీఆర్ హయాంలో నిర్మించిన చెక్ డ్యామ్ లను పూర్తి స్థాయిలో నామరూపాలు లేకుండా చేస్తున్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇసుక మాఫియాను కాపాడాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వ అండదండలతో కాంగ్రెస్ నాయకులు రైతుల కోసం నిర్మించిన చెక్ లను కులుచుతున్నారని హెచ్చరించారు. జమ్మికుంట పట్టణంలోని తనుగుల గ్రామంలోని మానేరు వాగులో నిర్మించిన చెక్ డ్యామ్ ప్రాంతాన్ని ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్లతో కలసి మంగళవారం బి ఆర్ ఎస్ పార్టీ నేతలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ జమ్మికుంట, ఓదెల మండలాల మధ్య మానేరు నదిపై గత ప్రభుత్వం కేసీఆర్ హయాంలో 24 కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్ డ్యామ్ ను ఇసుక మాఫియా ఆధ్వర్యంలో పేల్చివేశారని ఆరోపించారు. మానేరు వాగులో నిర్మించిన చెక్ డ్యామ్ ఇసుక తీయడం విలుపడనందున కాంగ్రెస్ నాయకులే పేల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న పెద్దపల్లి జిల్లా హుస్సేన్మియ వాగులోని బోజన్నపేట గ్రామంలో నిర్మించిన చెక్ డ్యామ్ ను సైతం పేల్చివేసినారని ఆధారాలతో తెలిపిన చర్యలు లేవని ఆరోపించారు. హుసేన్ మియా వాగులో పేల్చింది కాంగ్రెస్ నాయకులే అని అక్కడి రైతులు జిలేటిన్ స్టిక్స్, బాంబులు ఆధారాలతో పోలీసులకు పిర్యాదు చేస్తే కనీసం కేసులు నమోదు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతుంధని, కరీంనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్ , నిజామాబాదు జిల్లాల్లో చెరువులు, చెక్ డ్యామ్ లు చేయడం కాంగ్రెస్ నాయకుల నిత్యకృత్యం అయిందన్నారు. హైదరాబాదులో హైడ్రా పేరుతో పేదల ఇళ్ళు లేకుండా విధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కట్టుడు, రేవంత్ రెడ్డి కూల్చుడేనా, ఇదేనా మీ ప్రభుత్వ యవ్వారం అని ప్రశ్నించారు. ఆనాడు బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయంలో కేసీఆర్ 1200 చెక్ డ్యామ్ లు, మిషన్ కాకతీయ పథకం ద్వారా 44వేల చెరువుల పునరుద్ధన చేపట్టి రైతులకు రెండు పంటల సాగునీరు అందించి అదుకుందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న కేవలం 1లక్ష ఎకరాలన్నా నిరందించారా అని ప్రశ్నించారు...కేసీఆర్ ప్రభుత్వంలో చెక్ డ్యామ్ లను నిర్మించింది ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అని చెప్పారు. నాణ్యత లేకుండా నిర్మించినట్లు తేలితే ఆ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మానేరు వాగు చెక్ డ్యామ్ ఘటనపై సమగ్ర విచారణ

## -సహజమా.... విధ్వంసమా.... దర్యాప్తు ముమ్మరం

## -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం



కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

మానేరు వాగు చెక్ డ్యామ్ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు.సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ అలం, ఇతర అధికారులతో కలసి సంఘటన స్థలాన్ని హైదరాబాద్ ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు.సహజంగా జరిగిందా లేక విధ్వంసమా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట పట్టణంలోని తనుగుల గ్రామ శివారులో మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సీరియస్ గా స్పందించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సంయుక్తంగా ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించి, ఈ ఘటన సహజంగా జరిగిందా, ఎవరైనా విధ్వంసం చేశారా అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. ?నవంబర్ 21వ తేదీ రాత్రి సమయంలో ఈ చెక్ డ్యామ్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఘటన నీటి ప్రవాహానికి సహజంగా జరిగిందా? లేక ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా విధ్వంసానికి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రీయ విచారణ క్లూస్ టీం పరిశీలన

ఘటనా స్థల పరిశీలనలో భాగంగా అధికారులతో పాటు హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజ్ నేతృత్వంలో కరీంనగర్ క్లూస్ టీం సభ్యులు, ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్లు రాజు, స్వర్ణజ్యోతి తనిఖీలు నిర్వహించారు.

?ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ ఘటనకు గల అసలు కారణాలను వెలికితీయడానికి పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నామని చెప్పారు. సాంకేతిక నిపుణుల సహకారంతో అక్కడి నుండి నమూనాలు (సాంపిల్స్) సేకరించాము. వీటిపై ప్రయోగశాలలో అవసరమైన పరీక్షలు నిర్వహించి, సమగ్ర నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాము" అని తెలిపారు. ?నివేదిక ఆధారంగా ఎవరైనా బాధ్యులని తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హుజురాబాద్ ఏసీపీ మాధవి , పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ఇన్స్పెక్టర్లు రామకృష్ణ గౌడ్, లక్ష్మీనారాయణ లతో పాటు ఎస్సైలు శేఖర్ రెడ్డి , ఆవుల తిరుపతి , నీటి పారుదల శాఖ అధికారులు , ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పేగుబంధానికి 5లక్షల బేరం

# 7 రోజుల పసికందు విక్రయ యత్నం

### భగ్నం చేసిన రెండవ టౌన్ పోలీసులు

### ముఠా అరెస్టు :టౌన్ ఎసిపి వెంకటస్వామి

కరీంనగర్, నవంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

పేగుబంధం గొప్పది...ఆ బంధానికి వెలకట్టలేము.. పేదరికం, భర్త వదిలేయడం.. ఆర్థిక భారం కారణంగా పేగుబంధానికి వెలకట్టిందో ఓ మూర?పు తల్లి.. పురిటి వాసన పోలేదు.. 7 రోజుల వయసున్న పసికందును విక్రయించడానికి యత్నించిన ముఠాను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సంఘటన వివరాలను రాత్రి టూ టౌన్ సిఐ సృజన్ రెడ్డితో కలిసి టాన్ ఎసిపి వెంకటస్వామి మీడియాకు వివరాలు వెల్లడించారు. పేదరికం, భర్త వదిలేసాడన్న కారణంతో కన్నతల్లే బిడ్డను అమ్మకానికి పెట్టడం, దానికి మధ్యవర్తులు సహకరించిన ఘటన నగరంలో కలకలం రేపింది.

ఘటన వివరాలు

వైజాగ్ కు చెందిన శీలం సాయిశ్రీ (22) అనే మహిళకు భర్తతో విభేధాలు రావడంతో గర్భిణిగా ఉన్న ఆమెను హైదరాబాద్ కు చెందిన స్నేహితులు అభినవ్, హీనా ఆశ్రయం కల్పించారు. ఈ నెల నవంబర్ 14న సాయిశ్రీ గాంధీ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సాయిశ్రీ ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకున్న అభినవ్, హీనా.. బిడ్డను పోషించడం కష్టమని, ఎవరికైనా అమ్మితే డబ్బులు వస్తాయని ఆమెను నమ్మించారు. ఇందుకు సాయిశ్రీ ఒప్పుకోవడంతో, హీనా తనకు తెలిసిన పల్లవి, భవాని అనే మధ్యవర్తుల ద్వారా కరీంనగర్ లో బేరం కుదుర్చుకున్నారు.

నాటకీయ పరిణామాలు

రూ. 5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్న ముఠా, నవంబర్



20న కారులో అశోక్ అనే డ్రైవర్ తో కరీంనగర్ చేరుకున్నారు. నగరంలోని ఓ పెళ్లిళ్ల బ్రోకర్ భవాని సూచన మేరకు నగరంలోని ఆర్య ఆసుపత్రి వద్దకు వెళ్లి బిడ్డను కొనుగోలుదారులకు చూపించారు. ఈ డబ్బుల విషయంలో గొడవ జరగడం, అనుమానాస్పదంగా వ్యవహరించడాన్ని గమనించిన ఓ ఆటో డ్రైవర్ వెంటనే 'డయల్ 100'కు సమాచారం అందించారు.

?పోలీసులు అప్రమత్తం కావడంతో భయపడిన ముఠా అక్కడి నుండి పరారయ్యేందుకు ప్రయత్నించింది. నిందితులను కిసాన్ నగర్ పెళ్లిళ్ల బ్రోకర్ భవాని ద్వారా రూ. 5 లక్షలు నగదు తీసుకుంటుండగా, కరీంనగర్ టూ టౌన్ పోలీసులు %ూ×% జె. అరుణ్ బృందం దాడి చేసి వారిని పట్టుకున్నారు.

స్వాధీనం

నిందితుల వద్ద నుండి పసికందును రక్షించి, విక్రయానికి తీసుకున్న నగదును 5 లక్షల రూపాయలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లి సాయిశ్రీ, మధ్యవర్తులు హీనా, అభినవ్, భవాని, కారు డ్రైవర్ అశోక్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కార్మికుడు రాజయ్య కుటుంబానికి అండగా ప్రజాసంఘాల నాయకులు

భూపాలపల్లి,భారత శక్తి, నవంబర్ 25:

భూపాలపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికుడు బొల్లి రాజయ్య విధులు నిర్వర్తిస్తూ అనుమానాస్పద మృతి చెందాడని మున్సిపల్ అధికారుల సానిటరీ ఇన్స్పెక్టర్, జవాన్ ఈ ఇద్దరు నిర్లక్ష్యం వల్లే కార్మికుడు మృతి చెందడం జరిగిందని మృతుని బంధువులు, ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తక్షణమే వీరిద్దరిని సస్పెండ్ చేయాలని, మృతుడి కుటుంబానికి ఎక్స్గ్రేషన్ ఇవ్వాలని, కుటుంబంలో ఇద్దరికీ ప్రభుత్వంలో పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలని, పక్క ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు.

రెండు రోజులు గా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు సింగరేణి కార్మిక వాడ కృష్ణ కాలనీలో చెట్లను కొట్టుటకు ఉపయోగిస్తు జాబ్ చాట్ లో లేని పనులను మున్సిపల్ కార్మికులతో చేపిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు ఊడ్చడం , కాలువలు తీయడం పనులు మాత్రమే చేయాలని విధులకు బుల్లి రాజయ్య చెట్లు కొట్టే సమయంలో ఏమి జరిగిందో కానీ అతను చనిపోయాడని ఇప్పటివరకు రాజయ్య కుటుంబాన్ని అధికారులు గానీ, ఎమ్మెల్యే కండ సత్యనారాయణ పరామర్శించలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నాం.లేనియెడల రాజయ్య కటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు బొల్లి రాజు, బీసీ జాక్ జిల్లా కన్వీనర్. పైడిపల్లి రమేష్, బీసీ ఎస్సీ ఎస్టీ సాధన సమితి జిల్లా కన్వీనర్ కొత్తూరి రవీందర్, విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ , మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ కర్ణాటకపు సమ్మయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లు పూర్తవుతున్నా నూతన అక్రిడిటేషన్లు జారీ చేయని ప్రభుత్వం: టీ యూ డబ్ల్యూ జె

హైదరాబాద్, నవంబర్ 25,(భారత శక్తి):తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్లు జారీ చేసే విషయంలో ప్రభుత్వం, మీడియా అకాడమీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు అక్రెడిటేషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు, జీవో జారీ చేయకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు.మార్గదర్శకాల రూపకల్పన పేరుతో కమిటీలు వేసుకుంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఈ విధంగా ముందుకు సాగితే మరో రెండు సంవత్సరాలు అయినా కొత్త అక్రెడిటేషన్లు జారీ అవుతాయా అనే అనుమానం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన కార్డులను మూడు నెలలకు ఒకసారి గత సంవత్సర కాలంగా పొడిగిస్తూ స్టిక్కర్లు అంటించుకుని తిరగడం జర్నలిస్టుల పరిస్థితి ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోందన్నారు.గత ప్రభుత్వ హయాంలో 23 వేల అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయగా, ప్రస్తుతం వాటి సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తోందన్న అనుమానం జర్నలిస్టుల్లో నెలకొన్నదని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పంచేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ ఉండాలని అప్పుడు ఇస్తే ఇప్పుడు వాటిని ఏ విధంగా కోతపెట్టాలనే ఆలోచన చేస్తుండటం వల్లే ఈ ఆలస్యం జరుగుతుందనే చర్చ జర్నలిస్టుల్లో నెలకొందని వారు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నోటిఫికేషన్ రానుండటం, ఒకదాని తర్వాత ఒకటి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్డుల జారీ ప్రక్రియపై ఎలాంటి స్పష్టత లేకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు.మరో నెల రోజులు గడిస్తే మరో స్టిక్కర్ వేసుకోవాల్సిన దుస్థితి జర్నలిస్టులకు వస్తుందన్నారు.చిన్న పత్రికల జర్నలిస్టులు కూడా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎంపానెల్మెంట్, అప్గ్రేడేషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై తక్షణమే సమాచార శాఖ మంత్రి, మీడియా అకాడమీ చైర్మన్, కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పరిష్కార చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# ప్రతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 25 (భారతశక్తి):నిర్మల్ లో ప్రతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఎల్లుండి అనగా గురువారం రోజున ఆటో మోటివ్స్ విభాగంలో 180 ఉద్యోగాలు, హాస్పిటాలిటీ 130, హెల్త్ కేర్ విభాగాలలో 140 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. నిర్మల్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ప్రైవేట్ ఐటిఐ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9133003389 నంబరును ససంప్రదించవచ్చు. ఎటువంటి అనుభవం లేనివారికి కూడా ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవచ్చు. ఎంపికైనవారికి శిక్షణ కూడా ఇస్తారు.

# పల్లె ప్రజలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి. నవంబర్ 25, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం మొగుళ్లపల్లి మండలంలో పర్యటించి ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఏరియా ఆఫీసర్ యాప్లో భాగంగా నర్సరీ, పల్లె ప్రకృతి వనం, పొన్నాల లక్ష్మీ వ్యవసాయ క్షేత్రంలో కొబ్బరి మొక్కలు పెంపకం పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి, అక్కడ చేపట్టిన మొక్కల సంరక్షణ, పరిశుభ్రత పనులను పరిశీలించారు.

# దేశ ఐక్యతతోనే భారతదేశ భవిష్యత్తు ఆధారపడి ఉన్నది :

## రాజ్యసభ సభ్యులు మొకారియా రాంబాయి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25: భారతీయుల ఐక్యతతోనే భారతదేశ భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని రాజ్యసభ సభ్యులు మొకారియా రాంబాయి అన్నారు. మతాలు, రాష్ట్రాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా భారతీయులందరం ఒకే కుటుంబం అనే భావించే ఐకమత్యంతోనే భారతదేశ అభివృద్ధి, భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని గుజరాత్ రాష్ట్ర రాజ్యసభ సభ్యులు మొకారియా రామ్ భాయ్ వ్యాఖ్యానించారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఐక్యత మార్చ్ కార్యక్రమాల్లో భాగంగా కామారెడ్డి నగరంలో నిర్వహించిన ఐక్యత పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, విభిన్న రాజ్యాలుగా విడిపోయి ఉన్న భారతదేశాన్ని ఒక్కటిగా చేసి భారతదేశానికి ఒక మహోన్నతమైన రూపాన్ని ఇచ్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతం నిజాం యొక్క అరాచకాలలో నలిగిపోతున్న సమయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆనాటి హోం మంత్రిగా ఆపరేషన్ పోలో నిర్వహించి మన ప్రాంతానికి స్వాతంత్రాన్ని ప్రసాదించాలని అంతేకాకుండా భారత దేశంలో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేసి శాశ్వతమైన స్వతంత్రాన్ని కల్పించాడని గుర్తు చేశారు.

భారతదేశం ఎన్నో క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొని ఈరోజు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించడంలో ఆనాటి మహనీయుల పాత్ర ప్రశంసనీయమైనదని అదే ఆదర్శాన్ని నేటి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు కొనసాగిస్తున్నారని కొనియాడారు. వసుధైక కుటుంబం అనే భావనతో భారతీయులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందరూ బాగుండాలని కోరుకుంటారని ఇలాంటి గొప్ప మనస్తత్వం కేవలం భారతీయులలో తప్ప ఇంకెక్కడా కనిపించదని అందుకే భారతీయులుగా పుట్టిన మనమందరం గర్వించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

కార్యక్రమం యొక్క స్వాగతం ఉపన్యాసం చేసిన జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వం మన రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత అని ఆ యొక్క మూలాలను మనం ఎన్నటికీ మర్చిపోకుండా సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క స్ఫూర్తితో ఎప్పటికీ ఐకమత్యాన్ని ప్రదర్శించాలని,




భాషలు ప్రాంతాలు ఎక్కువ తక్కువ బేధాలు వంటివి లేకుండా భారతీయులందరం ఒకటే అనే భావనను మనందరిలో నిర్మించడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ ఐక్యత పాదయాత్రలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్.బి) శ్రీ. మదన్ మోహన్ మాట్లాడుతూ, భారతదేశ స్వతంత్ర పోరాటంలో సాధించిన స్వాతంత్రాన్ని నిలుపుకునే క్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర అనిర్వచనీయమైనదని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కామారెడ్డి నగరంలోని జీవదాన్ హాస్పిటల్ వద్ద గల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభమైన ఈ ఐక్యత పాదయాత్ర నిజాంసాగర్ చౌరస్తా, న్యూ బస్టాండ్, శ్రీ సరస్వతీ శిశు మందిర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మిదుగా ఇందిరాగాంధీ స్టేడియం వద్దకు చేరుకుంది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులు, నగర ప్రజల చేత ఐక్యత ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు చేత గొని ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ నినాదాలు చేస్తూ, జరిగిన మార్చ్ ఎంతో ఉత్సాహాన్ని మరియు దేశభక్తిని కలిగించింది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీ. రాజేందర్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) శ్రీ.జనార్ధన్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీ రంగ వెంకటేశ్వర్ గౌడ్, కామారెడ్డి టౌన్ (ఎస్ఎచ్ఓ) శ్రీ. రాజారామ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ. జైపాల్ రెడ్డి, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్ ఇతర జిల్లా అధికారులు, రాజకీయ ప్రముఖులు ,పెద్ద సంఖ్యలో యువతీ , యువకులు, కళాశాల/పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

# టీమ్ఇండియాకు గుడ్ న్యూస్..
## మళ్లీ సాధన మొదలుపెట్టిన శ్రేయస్ అయ్యర్

టీమ్ ఇండియాకు శుభవార్త. గాయం బారినపడిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టడంపై దృష్టిసారించాడు. అతను జిమ్‌లో నెమ్మదిగా కసరత్తులు చేయడం ప్రారంభించాడు. ఎక్సర్‌సైజ్ బైక్‌పై వ్యాయామం చేస్తున్న ఫొటోను శ్రేయస్ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దీంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. అతను వీలైనంత త్వరగా భారత జట్టుకు ఆడాలని కోరుకుంటున్నారు. గత నెల చివరలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో క్యాచ్ అందుకునే క్రమంలో శ్రేయస్ తీవ్రంగా గాయపడ్డాడు. క్యాచ్ అందుకొనే క్రమంలో బలంగా నేలను తాకాడు. దీంతో అతడి ప్లీహానికి తీవ్ర గాయమైంది. వెంటనే ఆస్పత్రికి చికిత్స అందించారు. సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో రెండు రోజులు ఐసీయూలో ఉండి చికిత్స చేయించుకున్న అతను.. అక్కడి నుంచి డిశ్చార్జ్ అయి స్వదేశానికి వచ్చాడు. అప్పటి నుంచి డాక్టర్ దిన్షా పార్దివాలా.. అయ్యర్ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల అతను అల్ట్రాసోనోగ్రఫీ పరీక్ష చేయించుకోగా.. మెరుగుదల కనిపిస్తున్నట్లు చెప్పారు. అయితే కడుపుపై ఒత్తిడిని కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అయ్యర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలకు పైగానే సమయం పడుతుందట. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు కూడా అతను అందుబాటులోకి రాడట. ఫిట్‌నెస్ సాధించినా మ్యాచ్ ప్రాక్టీస్ ఉండదు కాబట్టి ఫిబ్రవరి మార్చి నెలల్లో జరిగే టీ20 ప్రపంచకప్



ఎంపికకు శ్రేయస్ పేరును సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోవడం కష్టమే. బహుశా మళ్లీ ఐపీఎల్‌లోనే అతణ్ని మైదానంలో చూస్తామేమో!




## టీ20 వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ విడుదల..
# భారత్, పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?




వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. ఈ టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టోర్నమెంట్ జరగనుంది. భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగనుంది. గత ఎడిషన్ మాదిరిగానే ఈ సారి కూడా 20 జట్లు పాల్గొననున్నాయి. ఇటలీ మొదటిసారి టోర్నీకి అర్హత సాధించింది. 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి రెండేసి జట్లు సూపర్ 8కు అర్హత సాధిస్తాయి. సూపర్ 8లోని నాలుగు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ఇందులో టాప్ 2 జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లు భారత్‌లోని అయిదు వేదికల్లో (అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి), శ్రీలంకలోని మూడు వేదికల్లో (క్యాండీలోని పల్లెకెలె స్టేడియం, కొలంబోలోని రెండు స్టేడియాల్లో) జరగనున్నాయి. షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో భారత స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ, భారత టీ20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్, టీమ్ఇండియా మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పాల్గొన్నారు. భారత్‌కు 2024 ప్రపంచ కప్ సాధించిన పెట్టిన రోహిత్ శర్మను టీ20 వరల్డ్ కప్ 2026కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు.

**భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్**

ఫిబ్రవరి 7 యూఎస్ఏతో.. ముంబయి
ఫిబ్రవరి 12 నమీబియాతో.. దిల్లీ
ఫిబ్రవరి 15 పాకిస్థాన్‌తో.. ప్రేమదాస స్టేడియం, కొలంబో
ఫిబ్రవరి 18 నెదర్లాండ్స్‌తో.. అహ్మదాబాద్

# సౌతాఫ్రికాతో రెండో టెస్టు.. భారత్ టార్గెట్ 549

గువాహటి: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా సెకండ్ ఇన్నింగ్స్‌ను ముగించింది. 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సఫారీల జట్టు 260/5 వద్ద డిక్లేర్ చేసింది. ఈ క్రమంలోనే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 కలిపి టీమ్ఇండియాకు 549 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. వన్‌డౌన్ బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్ (94; 180 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ ముంగిట ఔటయ్యాడు. అతను ఔట్



కాగానే సౌతాఫ్రికా డిక్లేర్ చేసింది. టోని డి జోర్జి (49; 68 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. రికెల్‌టన్ (35), వియాన్ ముల్డర్ (35*), మార్‌క్రమ్ (29) రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 489 పరుగులు చేయగా.. భారత్ 201కే ఆలౌట్ అయింది.

# మళ్లీ ఆస్పత్రిలో చేరిన స్మృతి మంధాన కాబోయే భర్త

భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన తండ్రి అనారోగ్యానికి గురవడంతో ఆమె వివాహం వాయిదా పడిన విషయం తెలిసిందే. అనంతరం వరుడు పలాశ్ ముచ్చల్ వైరల్ ఇన్ఫెక్షన్, అసిడిటీ వల్ల ఇబ్బందిపడడంతో అతన్ని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. అయితే మంగళవారం మరోసారి పలాశ్ అస్వస్థతకు గురవడంతో ముంబయిలోని ఎస్‌వీఆర్ ఆస్పత్రికి తరలించినట్లు అతని టీం పేర్కొంది. ఫొటో షూట్‌ల కోసం వరుస ప్రయాణాలు, కొన్ని రోజులుగా సంగీత్, వివిధ కార్యక్రమాల్లో నృత్యాలు చేస్తుండడం, సరైన నిద్ర లేకపోవడం,



ఇతర కారణాల వల్ల పలాశ్ ఒత్తిడికి లోనై అస్వస్థతకు గురైనట్లు అతడి టీమ్ పేర్కొంది. స్మృతి తండ్రికి, పలాశ్‌కు మంచి అనుబంధం ఉందని.. ఆదివారం ఆయన హఠాత్తుగా అనారోగ్యానికి గురవడాన్ని తట్టుకోలేకపోయిన పలాశ్ 4 గంటల పాటు ఏడుస్తూనే ఉన్నాడని అతడి తల్లి పేర్కొన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అందువల్లే పలాశ్ ఆరోగ్యం క్షీణించిందని ఆమె తెలిపారు.




# మూడో రోజూ నష్టాల్లో సూచీలు..
## 25,900 దిగువకు నిఫ్టీ


ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ నవంబర్ సిరీస్ ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ కూడా మరో కారణంగా నిలిచింది. ఈ క్రమంలోనే నిఫ్టీ 25,900 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 85,008.93 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,900.71) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,536.73 85,110.24 మధ్య కదలాడింది. చివరికి 313.70 పాయింట్ల నష్టంతో 84,587.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 74.70 పాయింట్ల



నష్టంతో 25,884.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.20గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీఎంపీవీ, ట్రెంట్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, ఎస్‌బీఐ, టాటా స్టీల్, ఎటెర్నల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4135 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# ఫ్రీగా అడోబ్ ఫొటోషాప్..
## సాఫ్ట్‌వేర్‌తో పనిలేకుండా ఇక ఆన్‌లైన్‌లోనే!


ఫొటో ఎడిటింగ్ టూల్ అడోబ్ ఫొటోషాప్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఎన్ని కొత్త టూల్స్ అందుబాటులోకి వచ్చినా దీనికున్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పుడు ఈ ఫొటోషాప్ ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. గూగుల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్ రూపంలో లభిస్తోంది. అంటే ఫొటోషాప్ సాఫ్ట్‌వేర్‌ను ప్రత్యేకంగా డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేకుండా ముఖ్యమైన ఎడిటింగ్ ఫీచర్లన్నీ ఈ ఎక్స్‌టెన్షన్ ద్వారా వాడుకోవచ్చు. ఈ ఫీచర్ వాడాలంటే గూగుల్ క్రోమ్ ఫొటోషాప్ ఎక్స్‌టెన్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి డౌన్లోడ్ చేసుకున్నాక నేరుగా బ్రౌజర్‌లోనే




ఫొటోషాప్‌ను వినియోగించుకోవచ్చు. డిసెంబర్ 8లోపు ఈ ఎక్స్‌టెన్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నవారికి 12 నెలల పాటు ఉచిత యాక్సెస్‌ను అడోబ్ అందిస్తోంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ద్వారా ఈ ఎక్స్‌టెన్షన్‌ను మరింత మెరుగుపరుస్తామని, కొత్త ఫీచర్లు జోడిస్తామని కంపెనీ తెలిపింది. ఆన్‌లైన్‌లో లైట్ వెయిట్ ఎడిటింగ్ టూల్స్ కోసం చూసేవారి కోసం ఇది ఉపయుక్తంగా ఉంటుందని తెలిపింది. గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో photoshop chrome ex tension అని సెర్చ్ చేసి ఎక్స్‌టెన్షన్‌ను పొందొచ్చు. లేదా క్రోమ్ వెబ్‌స్టోర్‌లోకి వెళ్లి ఫొటోషాప్ ఎక్స్‌టెన్షన్‌ను మీ బ్రౌజర్‌కు జోడించొచ్చు. ఈ టూల్‌లో బ్యాగ్రౌండ్ రిమూవల్; కలర్ అండ్ ఎక్స్‌పోజర్ అడ్జెస్ట్‌మెంట్; ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లకు అనుగుణంగా మీకు కావాల్సిన డైమెన్షన్లలో ఇమేజ్‌లను క్రాప్ చేసుకునే సదుపాయాన్ని అడోబ్ అందిస్తోంది.

# యాపిల్‌లో ఉద్యోగాల కోత..
## కానీ వారికో ఆఫర్..!

రష్యా చమురు వ్యాపారంలో అమెరికా ఆంక్షలు కొత్తమార్పులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్ , లుకోయిల్ లపై ఆంక్షలు అమల్లోకి రావటంతో క్రూడాయిల్ ధరలు రికార్డు స్థాయిలో తగ్గాయి. దీంతో భారత్‌కు చమురు సరఫరా చేసే విధానం మారింది. ఇది మన రిఫైనరీలకు భారీ లాభాలను అందించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడిచమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి. రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా ఆంక్షలు విధించాక లాభదాయకంగా ఉన్న అక్కడి చమురు వ్యాపారం తారుమారైంది. ప్రస్తుతం రష్యా ప్రధాన చమురు అయిన ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు ధర కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించడానికి సిద్ధమయ్యారు. ఆంక్షలు



లేనప్పుడు ఈ తగ్గింపు కేవలం మూడు డాలర్లుగా ఉండేది. ఈ కొత్త ఆఫర్ డిసెంబరులో లోడ్ చేసి, జనవరిలో భారత్‌కు చేరే చమురుకు వర్తిస్తుంది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ భారీగా కొనుగోలు చేస్తూ వచ్చింది. కానీ, నవంబర్ 21 నుంచి ఆంక్షలు అమల్లోకి రావటంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. అయితే, ఈ వారంలో ఉరల్స్ చమురు ధర బాగా తగ్గడంతో భారత రిఫైనరీల వైఖరి మారింది. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురును కొనుగోలు చేయడానికి కొన్ని రిఫైనరీలు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఐదో వంతు మాత్రమే ఆంక్షలు లేని సంస్థల నుంచి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# టాటా సియారా వచ్చేసింది..
## ధర రూ.11.49 లక్షల నుంచి ప్రారంభం





ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్ తన ఐకానిక్ మోడల్ సియారాను మళ్లీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 1991లో తొలిసారి విడుదలైన ఈ మోడల్‌ను.. 2003లో నిలిపివేశారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇప్పటి అవసరాలు, హంగులతో కొత్త సియారాను మళ్లీ తీసుకొచ్చారు. అప్పటి రెట్రో లుక్‌ను కొనసాగించిన టాటా మోటార్స్.. దీన్ని 'రీబర్త్ ఆఫ్ ఎ లెజెండ్'గా అభివర్ణించింది. ఈ ఎస్‌యూవీ ధర రూ.11.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. డిసెంబర్ 16 నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది. టాటా డీలర్‌షిప్‌ల వద్ద గానీ, ఆన్‌లైన్‌లో గానీ బుక్ చేసుకోవచ్చని పేర్కొంది. 2026 జనవరి 15 నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఇంజిన్ విషయానికొస్తే.. కొత్త సియారా పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది.

## శింబు సినిమాలో విలన్‌గా
# విజయ్ సేతుపతి



కోలీవుడ్ నటుడు శింబు డైరెక్టర్ వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'అరసన్'. తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో విడుదల కానుంది. ఈ సినిమాలో విలన్‌గా విజయ్ సేతుపతి నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ విషయాన్ని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌లోకి విజయ్ సేతుపతికి స్వాగతం పలుకుతూ పోస్ట్ పెట్టారు. ఇక ఈ చిత్రంలో హీరోయిన్‌గా సమంతను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఆమెతో చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే కీర్తి సురేశ్, శ్రీలీల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం 'వడచెన్నై'లో యూనివర్స్‌లో భాగంగానే రానున్నట్లు గతంలో వెట్రిమారన్ తెలిపారు.


## భర్తపై గృహహింస కేసు పెట్టిన బాలీవుడ్ నటి..!



ప్రముఖ బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ తన భర్త పీటర్ హాగ్‌పై గృహహింస కేసు పెట్టారు. గృహహింస, క్రూరత్వం, మోసపూరిత చర్యలకు పాల్పడినందుకు గాను ఆమె ఈ కేసు పెట్టినట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మంగళవారం ముంబయిలోని ఓ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందుకు సెలీనా దాఖలు చేసిన ఈ పిటిషన్ వచ్చింది. దీన్ని పరిశీలించిన అనంతరం పీటర్ హాగ్‌కు నోటీసులు జారీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రియాలో పీటర్ కస్టడీలో ఉన్న తన పిల్లలను కలిసేందుకు కూడా అతడు అవకాశం ఇవ్వడం లేదని సెలీనా పిటీషన్‌లో పేర్కొన్నారు. వారితో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం అయినా కల్పించాలని కోరారు. పీటర్ నుంచి నెలకు రూ.10 లక్షల భరణంతో పాటు రూ.50 కోట్లు పరిహారం ఇప్పించాలని పేర్కొన్నారు. దీనిపై డిసెంబరు 12న తదుపరి విచారణ జరగనుంది. సెలీనా జైట్లీ, పీటర్ హాగ్‌లు 2011లో ఆస్ట్రియాలో వివాహం చేసుకున్నారు. 2012లో జైట్లీ ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చారు. కొన్నేళ్ల తర్వాత ఈ జంటకు మరోసారి కవలలు పుట్టారు. అయితే, అనారోగ్య కారణాలతో వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. సెలీనా జైట్లీ తెలుగు ప్రేక్షకులకు సుపరిచతమే. 2004లో విడుదలైన 'సూర్యం' సినిమాలో నటుడు మంచు విష్ణుతో కలిసి ఆమె నటించింది.

## నిర్మాతకు మిగిలేది 17 పైసలే..

**: టికెట్ ధరలపై నిర్మాత ఎస్కేఎన్ విశ్లేషణ**



పాప్ కార్న్, సమోస, కూల్ డ్రింక్స్, థియేటర్ యాడ్స్‌తో నిర్మాతకి సంబంధం ఉండదని ఎస్కేఎన్ తెలిపారు. కష్టపడి దర్శకుడు, హీరోని ఒప్పించి.. అప్పులు చేసి మరీ సినిమాలు నిర్మించే వారికి టికెట్ల విక్రయాల నుంచి ఎంత శాతం వస్తుందో తెలియజేసే ఫొటో పంచుకున్నారు. మల్టీప్లెక్స్‌లో ఒక ఫ్యామిలీ దాదాపు రూ.2200 ఖర్చు పెట్టి సినిమా చూస్తే అందులో 17 శాతం మాత్రమే ప్రొడ్యూసర్‌కు దక్కుతుందన్నారు. మూవీ టికెట్ ధరలపై కొంతకాలంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. దానికి స్పందనగానే ముఖ్యంగా మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధరలకు సంబంధించి ఈ విశ్లేషణాత్మక పోస్టు పెట్టినట్టు సమాచారం. నిర్మాత ట్వీట్ ప్రకారం.. నలుగురు సభ్యులున్న కుటుంబం మల్టీప్లెక్స్‌లో సినిమా చూడాలంటే, రూ.2178 ఖర్చవుతుందట. అత్యధిక భాగం మల్టీప్లెక్స్‌లకే వెళ్తున్నట్లు ఎస్కేఎన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇందులో మెయింటెన్స్, అక్కడ ప్రేక్షకుడు కొనుగోలు చేసే ఆహార పదార్థాలు, ఇతర సర్వీసు ఛార్జీలు కలిపి రూ.1,545 మల్టీప్లెక్స్‌కు వెళ్తుండగా, నిర్మాతకు రూ.372 (నెట్), ప్రభుత్వ పన్ను రూ.182 (జీఎస్టీ), బుక్‌మై షోకు కన్వీనియన్స్ ఫీజు రూపంలో రూ.78 వెళ్తున్నట్లు తెలిపారు. ''సినిమాను కోసం తనే పెట్టుబడి పెట్టి, అందుకు సంబంధించిన పూర్తి రిస్క్ తనే భరిస్తున్న నిర్మాతకు ఈ మొత్తంలో వచ్చేది సుమారు 17.08శాతం మాత్రమే. బుక్ మై షో పొందే 3.61శాతం కన్వీనియన్స్ ఫీజులో నిర్మాతకు ఎలాంటి వాటా ఉండదు. నిర్మాత తెగ లాభపడిపోతున్నాడని వాదిస్తున్న వారి కోసమే ఈ ప్రజెంటేషన్‌తో ముందుకు రావాల్సి వచ్చింది.

## నేనేం డాక్టర్‌ని కాదు.. కానీ..
# క్యాన్సర్ చికిత్స వ్యాఖ్యలపై సోనాలి బింద్రే స్పష్టత

ఒక్కోసారి నటీనటుల మాటలు వారికి చిక్కులు తెస్తాయి. తాజాగా నటి సోనాలి బింద్రే తన క్యాన్సర్ గురించి చెబుతూ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారి విమర్శలకు దారితీశాయి. దీంతో ఆమె తన కామెంట్స్‌పై స్పష్టతనిస్తూ పోస్ట్ పెట్టారు. సోనాలి 2018లో మెటాస్టాటిక్ క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసిందే. అయితే ఆమె మనోధైర్యంతో చికిత్స తీసుకొని ఆ మహమ్మారి నుంచి బయటకు వచ్చి ఎంతోమందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు . ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ తాను క్యాన్సర్‌ను జయించడానికి ప్రకృతి వైద్యం



ఎంతో సాయపడిందన్నారు. ఈ వ్యాఖ్యలను కొందరు వైద్యులు తప్పు పట్టారు. ప్రకృతి వైద్యం క్యాన్సర్‌ను తగ్గిస్తుందని ఎక్కడా సరైన ఆధారాలు లేవంటూ విమర్శలు చేశారు. దీంతో సోనాలి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను ఎప్పుడూ డాక్టర్‌ని అని చెప్పలేదన్నారు. నిజాయితీగా ఆ మహమ్మారి వల్ల తాను పడిన బాధను ప్రజలతో పంచుకున్నట్లు వివరించారు. ''నేను ఎప్పుడూ డాక్టర్‌ని అని చెప్పలేదు. మోసగత్తెని కూడా కాదు. నేను క్యాన్సర్‌తో నరకం అనుభవించినదాన్ని. దానివల్ల కలిగే భయం, నొప్పి, బాధ అన్నీ తెలిసిన వ్యక్తిని. నేను ఇప్పటివరకూ మాట్లాడినవన్నీ నా అనుభవాలు, నేను నేర్చుకున్న పాఠాలు. నేను పదేపదే చెబుతున్నాను. క్యాన్సర్లు అన్నీ ఒకేలాంటి లక్షణాలు కలిగిఉండవు. అలాగే చికిత్స కూడా వేరుగానే ఉంటుంది అని. నా అనుభవాలను పంచుకుంటూ నేను తీసుకున్న వైద్యం గురించి తెలిపానంతే. దీనిని అందరూ అంగీకరించాలని, పాటించాలని నేను చెప్పలేదు. ప్రతి వ్యక్తి తమకు సరైన, సురక్షితమైన విధానాలనే ఎంచుకోవాలని కోరుకుంటున్నా. మరోసారి స్పష్టంచేస్తున్నా.. నేను నా ప్రయాణాన్ని నిజాయితీగా మీతో పంచుకున్నానంతే'' అని సోనాలి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. సందర్భం వచ్చినప్పుడల్లా సోనాలి క్యాన్సర్‌తో తను చేసిన పోరాటాన్ని, తన జీవితాన్ని అది ఎలా మార్చేసిందో వెల్లడిస్తూ అందరిలో ధైర్యాన్ని నింపుతుంటారు. ''మన జీవిత ప్రయాణం ఎప్పుడూ ఆగిపోకూడదు.

# సినిమా



# సర్‌ప్రైజ్ గిఫ్ట్

కాబోయే సతీమణికి సర్ ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చాడు మన హైదరాబాదీ సెలబ్రిటీ సింగర్ రాహుల్ సిప్లీగంజ్. రాహుల్ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరుడి కుమార్తె హరిణ్యారెడ్డిల వివాహం ఈనెల 27న జరగనుంది. సంగీత్ వేడుకలో రాహుల్ తనకు కాబోయే భార్యకు అద్భుతమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. అదేమిటంటే టీమ్ ఇండియా స్పిన్నర్ చాహల్‌ను ఆహ్వానించారు. ఈ వేడుకకు వచ్చిన చాహల్ కాబోయే వధూవరులతో సందడి చేశారు. ఇది తనకు పెద్ద సర్‌ప్రైజ్ అంటూ చాహల్‌తో దిగిన ఫొటోను హరిణ్యారెడ్డి పంచుకున్నారు. ''నేను చాహల్‌కు వీరాభిమానిని. ఆయన మన సంగీత్‌కు వచ్చారంటే నేను ఇంకా నమ్మలేకపోతున్నా.. ఇంత పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చినందుకు ధన్యవాదాలు రాహుల్. ఈ క్షణాలను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను.' అని హరిణ్య పోస్ట్ పెట్టారు. చాహల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నవంబర్ 27న జరగనున్న రాహుల్‌హరిణ్యాల వివాహానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.







**ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్స్**

# అమర్‌సింగ్ చంకీలకు నిరాశే



53వ ఇంటర్నేషనల్ ఎమీ అవార్డ్స్ 2025 వేడుక న్యూయార్క్‌లో అట్టహాసంగా జరిగింది. కెల్లీ రిపా, మార్క్ కాన్స్యాలోస్ హోస్ట్ చేసిన ఈ కార్యక్రమంలో హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. అయితే ఈ అవార్డుల బరిలో భారత్ తరపున పోటీలో నిలిచిన 'అమర్‌సింగ్ చంకీల'కు నిరాశ ఎదురైంది. రెండు విభాగాల్లో పోటీలో నిలిచిన ఈ చిత్రం ఎందులోనూ అవార్డును సొంతం చేసుకోలేకపోయింది. దీంతో ఇండియాకు ఒక్క అవార్డు కూడా రాలేదు. ఇంతియాజ్ అలీ తెరకెక్కించిన అమర్ సింగ్ చంకీల.. బెస్ట్ మినీ సిరీస్, ఉత్తమ నటుడు విభాగాల్లో నామినేషన్ దక్కించుకుంది. ఒక్క విభాగంలోనైనా విజయం సాధిస్తుందని ఎదురుచూసిన ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. ఉత్తమ మినీ సిరీస్ విభాగంలో 'లాస్ట్ బాయ్స్ అండ్ ఫెయిరీస్' విజేతగా నిలవగా.. ఉత్తమ హీరోగా ఓరియోల్ ప్లా అవార్డును అందుకున్నారు. ఇక 27 ఏండ్ల వయసులోనే హత్యకు గురైన ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్‌సింగ్ చంకీల జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొంచారు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్‌అందించాడు. పంజాబీ, బాలీవుడ్ నటుడు దిల్జీత్ దొసాంజ్, నటి పరిణితీ చోప్రా ప్రధాన పాత్రల్లో కనిపించారు. దీనికోసం పరిణీతి దాదాపు 30 కిలోల బరువు తగ్గింది. ప్రస్తుతం 'అమర్‌సింగ్ చంకీల' నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్‌అవుతోంది.

## ఓటీటీలోకి
# మాస్ జాతర

టాలీవుడ్ స్టార్ హీరో మాస్ మహా రాజ రవితేజ, బ్యూటిఫుల్ హీరోయిన్ శ్రీలీల నటించిన లేటెస్ట్ మూవీ మాస్ జాతర. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చేసిన ఈ సినిమా జనాలను పెద్దగా ఆకట్టుకోలేదు. దాంతో రవితేజ ఫ్యాన్స్ కు నిరాశ తప్పలేదు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన ధమాకా మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈసారి మిక్స్‌డ్ టాక్ ను అందుకుంది. ఇక ఈ చిత్రాన్ని థియేటర్ల లో మిస్ అయిన వారికి మేకర్స్‌గుడ్‌న్యూస్‌చెప్పారు. ఈనెల 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లోకి 'మాస్ జాతర' రానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వచ్చేసింది. భాను భోగవరపు తెరకెక్కించిన ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నవీన్ చంద్ర విలన్ గా ఆకట్టుకున్నాడు. అలాగే రాజేంద్ర ప్రసాద్, నరేశ్, ప్రవీణ్, వీటీవీ గణేశ్, హైపర్ ఆది, అజయ్ ఘోష్, హిమజ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్ర్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించగా, శ్రీకర స్టూడియోస్ సమర్పించింది.

# విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలి:జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 25: జిల్లాలోని బీసీ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ హాస్టల్స్‌ను మరింత మెరుగుపర్చడంలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని బీసీ అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం సంగారెడ్డి పట్టణం లోని బాలురవసతిగృహం విద్యార్థులకు ,హాస్టల్ గడ్డ బీసీ బాలికల వసతి గృహం విద్యార్థులకు కిర్బీ సంస్థ, సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా స్టెయిన్లెస్ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్కూల్ బ్యాగులు, ట్రంక్ బాక్సులను, జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి విద్యార్థులకు అందజేశారు. జిల్లా లోని 34 బిసి హాస్టల్ విద్యార్థులకు కిర్బీ సంస్థ సిఎస్ఆర్ నిధులు 29.89 లక్షల రూ. ద్వారా అందించిన స్టెయిన్లెస్ స్టీల్ ప్లేట్లు (3102), గ్లాసులు (3102), స్కూల్ బ్యాగులు (1681), ట్రంక్ బాక్సులు (1681) వంటి వస్తువులను జిల్లా కలెక్టర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. వసతి గృహాల విద్యార్థుల కోసం నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అయితే సమాజం, సంస్థలు బాధ్యతగా ముందుకు వస్తే విద్యార్థుల భవిష్యత్తు మరింత బలోపేతం అవుతుంది అని తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణంలో కావడం కోసమే కార్పొరేట్ సంస్థల సహకారంతో ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు శాత శాతం ఉత్తీర్ణమి




సాధించాలని, మంచి మార్కులు విద్యార్థులు సాధిస్తే మరోసారి వచ్చే విద్యార్థులకు ఘనంగా సన్మానించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ప్రావిణ్య ప్రసంగం విద్యార్థుల్లో ఉత్తేజం నింపింది. అనంతరం హాస్టల్ విద్యార్థులతో కలిసి ,వారి మధ్య కూర్చొని వాళ్లతో పాటు అల్పాహారం తీసుకున్నారు. వారి వసతి, భోజన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో ప్రత్యక్షంగా విద్యార్థిలను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భముగా బి సి సంక్షేమాధికారి జగదీశ్ మాట్లాడుతూ ...సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు కిర్బీ సంస్థ ద్వారా సిఎస్ఆర్ నిధులతో పంపిణీ చేసిన ఉపకరణాలు , విద్యా సౌకర్యాలకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ అభివృద్ధిలో భాగంగా ముందుకు వచ్చిన కిర్బీ సంస్థకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కిర్బీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజ మహేంద్ర , హెచ్ ఆర్ నాగరాజు , వార్డెన్ గౌసుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు , ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## సాధ్యమైనంత త్వరగా అమరావతిలో
# జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు

**: మంత్రి పార్థసారధి**

అమరావతి, నవంబర్ 25(భారత శక్తి): రాష్ట్ర రాజధాని అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు చేసే విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అమరావతి జర్నలిస్టు హౌసింగ్ ప్రాజెక్ట్ పై రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కె పార్థసారధి సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై మంత్రి పార్థసారథిని అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు, పలువురు సీనియర్ జర్నలిస్టులు ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మంగళవారం కలిశారు. జర్నలిస్టుల కోసం సిఆర్డీఏ ఆధ్వర్యంలో బహుళ అంతస్థుల గృహ సముదాయాన్ని నాలుగు కేటగిరీలలో నిర్మించే నిమిత్తం 30 ఎకరాల భూమిని మందడం, తుళ్లూరు పరిధిలో అమరావతి హౌసింగ్ సొసైటీకి 2019లో కేటాయించటం జరిగిందని వారు వివరించారు. దానిని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తూ సిఆర్డీఏ సంస్థనే డెవలపర్ గా దాని ఆధ్వర్యంలోనే ప్రాజెక్ట్ నిర్మించాలని సొసైటీ గతంలో ప్రభుత్వాన్ని కోరింది. ఇందు నిమిత్తమే సొసైటీకి కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వటం జరిగింది. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకరించిన నేపథ్యంలో ప్రభుత్వం జీవో నెంబర్ 107 ఇస్తూ హ్యాపీనెస్ట్ మోడల్ లో నిర్మిస్తామని పేర్కొంది. ఇప్పుడు ఆ ఉత్తర్వులు అమలు జరిగేలా చూడాలని కోరుతూ పార్థసారధి ని అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో పాటు సీనియర్ జర్నలిస్టులు కోరడం జరిగింది. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను, హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తిని మంత్రి నారాయణ, సిఆర్డీఎ కమిషనర్ దష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీనిని సాధ్యమైనంత త్వరగా అమలు జరిగేలా అవసరమైన వారితో సంప్రదింపులు జరుపుతామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా మంత్రి సారధి వెంటనే సమాచార శాఖ డైరక్టర్ విశ్వనాధ్ కి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సమాచార శాఖ డైరక్టర్ కూడ ఈ విషయంపై సత్వరమే సంప్రదింపులు జరుపుతామని ఆయనను కలిసిన జర్నలిస్టు సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రి ని కలిసిన వారిలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్లు చావా రవి, టివి 9 ఈశ్వర్ , మహాటివి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు ఆంధ్రప్రభ బ్యూరో ఛీఫ్ గోపీ, ఆంధ్రజ్యోతి సత్యనారాయణ, హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాధ్, ఎస్ మల్లిఖార్జున్ , భి నాగేశ్వర రావు ఉన్నారు.

## విద్యుత్తు ఆర్టిజన్ ఎంప్లాయిస్
# జాయింట్ యాక్షన్ కేటీపీపి చెల్పూర్ లో గేట్ మీటింగ్


**: రాష్ట్ర చైర్మన్ సుంకు సతీష్ రెడ్డి**

భూపాలపల్లి,భారత శక్తి, నవంబర్ 25: మంగళవారం గణపురం మండలం కేటీపీపి చెల్పూర్ లో గేట్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ మీటింగుకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మీటింగు రాష్ట్ర చైర్మన్ సుంకు సతీష్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను గత ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామని చెప్పి విద్యుత్ సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికులకు రెట్లు రెగ్యులరైజేషన్ చేయకుండా కొత్తగా స్టాండింగ్ ఆర్డర్స్ 1947 యాక్ట్ ప్రకారం APSEB రూల్స్ వర్తింప చేయకుండా ఇండస్ట్రీ ఆక్ట్ ప్రకారంగా ఆర్టిజన్గా నామకరణం చేయడం జరిగింది. ఇట్టి చట్టాన్ని కార్మికులందరూ వ్యతిరేకిస్తూ గత ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీని రెగ్యులరూ ఉద్యోగులతో సమానంగా ఆర్టిజన్ కార్మికులందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేయడం జరిగింది.ఇప్పుడున్న ప్రభుత్వం గతంలో ఇచ్చినటువంటి హామీని కార్మికులందరికీ ఏపీ ఎస్సీబీ రూల్స్ సర్వీస్ తో కూడిన కన్వర్షన్ విద్యారతను బట్టి కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పడం జరిగింది ఇట్టి విషయాన్ని పలుమార్లు ప్రభుత్వానికి యాజమాన్యానికి ఎన్నోసార్లు విన్నవించడం జరిగింది అయినా



కూడా స్పందించడం లేదు కావున ఎలక్ట్రిసిటీ సంస్థలో ఉన్నటువంటి అన్ని సంఘాల ఆర్టిజన్ కార్మికులు అందరూ ఒక తాటిమీద కచ్చి తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఉద్యమానికి పిలుపునివ్వడం జరిగింది కావున తమరు ఇప్పటికైనా స్పందించి 23 వేల కార్మికులందరినీ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఏపీ ఎస్సీబీ రూల్స్ (కన్వర్షన్) ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది లేనియెడల డిసెంబర్ మొదటి వారంలో పెద్ద ఎత్తున కార్మికులందరితో ధర్నాలు రాస్తారోకాలు చేయాలని నిర్ణయించడం జరిగింది అప్పటికి స్పందించని యెడల ముకుమ్మడిగా కార్మికులందరూ సమ్మె వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని యాజమాన్యానికి మరియు ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది. మా యొక్క డిమాండ్స్ విద్య మీ అందరితోనే నేను అర్హతను బట్టి ఆర్టిజన్ కార్మికులందరికీ ఏపీ ఎస్సీబీ రూల్స్ ద్వారా కన్వర్షన్ ఇవ్వాలి. మిగిలిపోయిన పీస్ రేట్ కార్మికుని జీవో నెంబర్ 11 ప్రకారం అందరినీ రెగ్యులరేషన్ చేయాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకత్వం కన్వీనర్ సాయిల్ గారు చంద్రారెడ్డి గారు కో చైర్మన్ శ్రీధర్ గౌడ్ గారు కో కన్వీనర్ చందర్ సింగ్ ఠాగూర్ గారు మరియు జెన్కో చైర్మన్ జక్కుల రమేష్ గారు కన్వీనర్ సిలివేరు మల్లయ్య గారు కో కన్వీనర్ టి రమేష్ గారు జాయింట్ సెక్రెటరీ సురేష్ గారు మరియు ప్రణయ్, శంకర్, కృష్ణ, NPDCL కరీంనగర్ డివిజన్ నాయకులు ఏ రవీందర్ గారు మరియు ఇతర కార్మిక సంఘాల ఆర్టిజన్ కార్మిక సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25 : సంగారెడ్డి పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతులమీదుగా లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 20 లక్షల 33 వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను కంది కొండాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం భూములను లాక్కోవడం తప్ప అభివృద్ధిని విస్మరించిందన్నారు. రెండు సంవత్సరాలు ప్రభుత్వ పాలన లో మున్సిపాలిటీలు గ్రామాలలో నయా పైస అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ నాయకుల స్టేట్మెంట్లు మాత్రం ఉన్నాయే తప్ప పైసా పనిలేదని విమర్శించారు. శంకుస్థాపనలకే పరిమితమై పనులు ప్రారంభించడం లేదని ఎద్దేవా చేశారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ని బొంద పెట్టడం కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మహిళలకు 2500 లేవు స్కూటీలు లేవు తులం బంగారం లేదు పెన్షన్ పెంచలే రైతుబంధు సక్రమంగా లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. చీరల నాణ్యత పంపిణీ విధానం అర్హుల ఎంపికలో జరిగిన లోపాలను ప్రజలు అంతా గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్కు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాతలను కాంటాల పేరుతో మోసం చేస్తున్న
# "మ్యాక్స్" దాన్యం కొనుగోలు కేంద్రాలు



సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి), నవంబర్ 25: రైతులు చదువు లేనివారైతే చాలు,అమాయకులను.. అదును చూసి కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమకు ఇష్టం వచ్చినట్లుగా కాంటాలు వేస్తున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం పోలిస్టేషన్ పక్కన గల మ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కాంటాలలో తూకంలో పెద్ద ఎత్తున తేడా వచ్చింది. ప్రభుత్వ అధికారులు పలుమార్లు నిర్వాహకులకు కేంద్రాల నిర్వహణపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అదేదీ తమకు పట్టనట్లుగా మాక్స్ ధాన్యం కొనుగోలు నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రైతుల, అధికారుల కండ్లుగప్పి ఈ తంతు జరిగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్తా తూకంతో కలిపి 40 కేజీల 700 గ్రాములు వేయవలసిఉండగా ఆ కేంద్రంలో మాత్రం 41 కేజీ 550 గ్రాములు ధాన్యం కాంటా వేస్తున్నారు. ఇదేమని నిర్వాహకులను అడిగితే అక్కడ ఉన్నవాళ్లు తమ ఇన్చార్జి లేదు అని ఒక మాట.. తమకు తెలుసు ఎంత వేయాలో అని మరొక మాట ఇలా పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. ఈ విధంగా రైతులను మోసం చేస్తున్న ఇలాంటి కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించక పోవడంతో వీళ్ళ ఆగడాలకు అడ్డు,అదుపు లేకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి వారికి మరోసారి కేంద్రాల నిర్వహణ బాధ్యత ఇవ్వద్దని చెబుతున్నారు.

*** తహసిల్దారు వివరణ**

ఈ విషయమై స్థానిక తహసిల్దారు శ్రీనివాస్ ను వివరణ కోరగా తాము అప్పుడప్పుడు కేంద్రాలను తనిఖీ చేస్తున్నామని ఈ విషయం తమ దృష్టికి రాలేదనీ తాము తనిఖీ చేసినప్పుడు ఎలాంటి ఇబ్బంది కలిగిన తక్షణమే చర్యలు తీసుకొని అలాంటి వారికి భవిష్యత్తులో కేంద్రాల నిర్వహణ బాధ్యతలు ఇవ్వబోమని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

- **టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**
- **సీఎం రేవంత్ రెడ్డితో కలిపించి గ్రామాలకు నిధులు వచ్చేలా కృషి చేస్తా**

సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సంగారెడ్డిలో మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డిని కలిసి గ్రామాలకు నిధులు ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. అధికారంలో లేనప్పుడు, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కండువా కప్పుకొని తిరిగిన అభ్యర్థులను సర్పంచిగా నిలబెట్టి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారిని సర్పంచ్ అభ్యర్థిగా ఎంపిక చేయవద్దని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు ఉన్న గ్రామాల్లో డబ్బులు లేని నిజమైన కార్యకర్తలను ఎంపిక చేయాలని ఆ గ్రామంలో ఉన్న కార్యకర్తలు నాయకులు ఆర్థికంగా వారికి సహకరించి గెలిపించేలా కృషి చేయాలన్నారు. సోనియాగాంధీ రాహుల్ గాంధీ మల్లికార్జున కార్గే జాతీయ న్యాయకత్వంలో సీఎం



రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి ఓట్లు అడగాలన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు 500 కే గ్యాస్ సన్న బియ్యం ఇందిరమ్మ ఇల్లు రెండు లక్షల రుణమాఫీ వారికి 500 బోనాస్ రేషన్ కార్డులు 200 యూనిట్ల ఉచిత కరెంటు వంటి పథకాలు ఓటర్ల వద్ద వివరించి ఓట్లు అడగాలన్నారు. కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఓటమికి ప్రయత్నం చేసే కార్యకర్తలు నాయకులు ఎంతటి వారైనా క్షమించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కార్పొరేషన్ చైర్పర్సన్ నిర్మల సహకారంతో సంగారెడ్డి నియోజకవర్గాన్ని పరిశ్రమల స్థాపనకు ఏర్పాట్లు చక చకా జరుగుతున్నాయన్నారు. ఇక్కడికి పరిశ్రమలు వస్తే రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే భూములు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు ప్రారంభమైతే ఈ ప్రాంత యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మల సంగారెడ్డి పటాన్చెరువు నియోజకవర్గం లో పరిశ్రమల స్థాపన కోసం కృషి చేస్తున్నారని అన్నారు. సంగారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులకు రానున్న మూడేళ్ల తర్వాత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నిర్మల పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

# కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు... తాజాగా 28 మంది సరెండర్

ఛత్తీస్‌గఢ్, నవంబర్ 25(భారత శక్తి): ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, అభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో మాద్ డివిజన్ డీవీసీఎం, పీఎల్‌జీఏ కంపెనీ నెం. 06 మిలిటరీ సభ్యుడు, ఏరియా కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ సభ్యుడు, మిలిటరీ ప్లాటూన్ సభ్యులు, సప్లై టీమ్ సభ్యులు వంటి పలు స్థాయిలకు చెందిన వారు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు ఒక ఎస్‌ఎల్‌ఆర్, ఒక ఇన్సాస్, ఒక .303 రైఫిల్‌తో సహా ఆయుధాలను భద్రతా దళాలకు అప్పగించారు. ఈ పరిణామంతో 2025లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు. గత 50 రోజుల్లోనే బస్తర్ వ్యాప్తంగా 512 మంది మావోయిస్టు క్యాడర్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకులు దేవ్‌జీ, రామ్‌దర్‌లకు కూడా లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిష్ఠా మామ్‌గయ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో వాయు కాలుష్యం..
## రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం

ఢిల్లీ, నవంబర్ 25(భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకరంగా పడిపోతున్న నేపథ్యంలో పీఎంవో రంగంలోకి దిగింది. కాలుష్యానికి కారకమయ్యే వాహనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాలుష్య నివారణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని విస్తృతం చేసేందుకు చర్యలు ముమ్మరం చేయాలని సూచించింది. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఢిల్లీలోని వాయు నాణ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో వాహనాల కాలుష్యం ప్రధానాంశంగా ప్రస్తావనకు వచ్చింది. దేశ రాజధానిలో ఇంకా 37 శాతం మేర పాత వాహనాలు వినియోగంలో ఉన్నట్లు సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వాటి స్థానంలో ఈవీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఈవీ వాహనాలకు రాయితీలు ఇవ్వడంతో పాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. కాలుష్య కారక పెట్రోల్, డీజిల్ వాహనాలు వినియోగాన్ని తగ్గించాలని అన్నారు.

## రాష్ట్రంలో 'ఏపీ-లింక్' ఏర్పాటు...
## లాజిస్టిక్స్ రంగంపై సీఎం చంద్రబాబు ఫోకస్

అమరావతి, నవంబర్ 25(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ రంగాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్" (AP LInC ఏపీ లింక్) ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంగళవారం నాడు సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆయన ఆమోదం తెలిపారు. ఈ కార్పొరేషన్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక హోల్డింగ్ కంపెనీ తరహాలో పనిచేయనుంది. రాష్ట్రంలోని పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులు అనే ఐదు కీలక రంగాలను ఏపీలింక్ అనుసంధానిస్తుంది. తద్వారా లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు, ఈ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం దీని ప్రధాన బాధ్యత. రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీలింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్పొరేషన్‌కు ఒక మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, ఒక సలహా కమిటీ ఉంటాయని ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల అమలు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సెల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏపీలింక్ ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అన్ని రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ సేవలను సమన్వయంతో అందించాలని ఆయన సూచించారు.

## మంత్రి నారా లోకేశ్
## 75వ రోజు ప్రజాదర్బార్... వెల్లువెత్తిన వినతులు

అమరావతి, నవంబర్ 25(భారత శక్తి): రాష్ట్ర ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసే లక్ష్యంతో ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన 75వ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. వారి నుంచి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కొన్ని క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే తన సిబ్బందికి, సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

*** లోకేశ్ దృష్టికి వచ్చిన పలు సమస్యలు**

ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిలో పలువురు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

* గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో తనపై అక్రమ కేసులు బనాయించి, కుటుంబాన్ని తీవ్ర క్షోభకు గురిచేశారని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన జరుగుళ్ల గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.
* పీజీ పూర్తి చేసినా ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్నానని, ఉపాధి అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా గోవిందపల్లెకు చెందిన పగిడి వెంకటలక్ష్మి మంత్రిని అభ్యర్థించారు.
* గుంటూరు జిల్లా కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 70 మంది సభ్యులు పొదుపు చేసిన రూ.7.55 కోట్ల నగదును సీఈవో దుర్వినియోగం చేశారని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని సంఘ సభ్యులు విన్నవించారు.
* మంగళగిరి నియోజకవర్గం పెద్దవడ్లపూడిలో తమ 0.39 ఎకరాల వ్యవసాయ భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కుర్రా వెంకట్రావు కోరారు.
* రాష్ట్రంలో రిటైర్డ్ పార్ట్‌టైమ్ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.4 వేల పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని ఏపీ రిటైర్డ్ పార్ట్‌టైమ్ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
* అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమారుడి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం అందించాలని విజయనగరం జిల్లాకు చెందిన వి.నాగభూషణం కోరారు.
* దివ్యాంగురాలైన తనకు జీవనోపాధి కోసం ట్రైస్కూటీ అందజేయాలని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ సుభాన్ బీ విన్నవించారు.
* పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు రూ.15 వేల పెన్షన్ అందించి ఆదుకోవాలని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన వై. మహాలక్ష్మి అభ్యర్థించారు.

ఈ విజ్ఞప్తులన్నింటినీ సావధానంగా పరిశీలించిన మంత్రి లోకేశ్, వాటిపై సానుకూలంగా స్పందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, ప్రభుత్వపరంగా అన్ని విధాలా అండగా నిలుస్తామని వారికి హామీ ఇచ్చారు.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్..

హైదరాబాద్, నవంబర్ 25(భారత శక్తి): దేతెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సాయంత్రం మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని ఆమె అన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను సెప్టెంబర్ 29న ప్రకటించామని, కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే వచ్చిందని ఆమె గుర్తు చేశారు. తొలి దశలో 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు... రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు, 38,350 వార్డులకు... మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలకు, 36,452 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.66 కోట్ల మంది గ్రామ ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లను నవంబర్ 27 నుంచి స్వీకరిస్తారు. రెండో విడత ఎన్నికలకు నవంబర్ 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు.

## ఇక భారత్‌లోనే హేమర్ స్మార్ట్ బాంబుల తయారీ..

ఢిల్లీ, నవంబర్ 25(భారత శక్తి): భారత రక్షణ రంగం ఆత్మనిర్భరత దిశగా మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే 'హేమర్' స్మార్ట్ బాంబులను తయారు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ , ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ & డిఫెన్స్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై బీఈఎల్ సీఎండీ మనోజ్ జైన్, సఫ్రాన్ ఈవీపీ అలెగ్జాండర్ జీగ్లర్ సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థలు కలిసి 50:50 వాటాలతో ఒక జాయింట్ వెంచర్ కంపెనీని (JVC) ఏర్పాటు చేయనున్నాయి. గతంలో 2025 ఫిబ్రవరిలో జరిగిన ఏరో ఇండియా ప్రదర్శన సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందం ఇప్పుడు కార్యరూపం దాల్చింది. హేమర్ అనేది ఫ్రాన్స్‌కు చెందిన అత్యంత అధునాతన ఎయిర్ టు గ్రౌండ్ స్మార్ట్ బాంబు. రఫేల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగిస్తే ఇది 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు బంకర్లు, కమాండ్ సెంటర్లు, రాడార్లను కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. గగనతలంలో తన మార్గాన్ని మార్చుకోగల సామర్థ్యం, జామింగ్‌ను తట్టుకోగల శక్తి దీని సొంతం. ఈ ఒప్పందం వల్ల 'మేకిన్ ఇండియా' కార్యక్రమానికి పెద్దపీట వేసినట్లయింది. తొలుత కొన్ని విడిభాగాలను ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్నా, దశలవారీగా 60 శాతం ఎలక్ట్రానిక్, మెకానికల్ భాగాలను దేశీయంగానే తయారు చేస్తారు. తయారీ, పరీక్ష, నాణ్యత నియంత్రణ బాధ్యతలను బీఈఎల్ చూసుకోనుంది. దీనివల్ల భారత వాయుసేన, నౌకాదళం అవసరాలకు విదేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అలాగే తేజస్ యుద్ధ విమానాల్లోనూ వీటిని అమర్చే అవకాశం ఉంటుంది. త్వరలోనే ఈ అత్యంత శక్తివంతమైన ఆయుధం భారత గడ్డపై తయారీ కానుంది.

## బాలకృష్ణ సినిమా వేడుకకు చీఫ్ గెస్ట్ గా సీఎం

హైదరాబాద్, నవంబర్ 25(భారత శక్తి): నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కూడా మరో అతిథిగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈవెంట్‌కు రాలేకపోతున్నారని తెలిసింది. సినిమా విడుదలయ్యాక జరిగే సక్సెస్ మీట్‌లో బన్నీ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, 'జాజికాయ జాజికాయ' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు, డిసెంబర్ 4వ తేదీ రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్ షోలు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ఎదురుచూస్తోంది.

## టీ20 వరల్డ్ కప్2026 బ్రాండ్ అంబాసిడర్ గా రోహిత్ శర్మ

ఢిల్లీ, నవంబర్ 25(భారత శక్తి): టీమిండియా మాజీ కెప్టెన్, 2024 టీ20 ప్రపంచకప్ విజేత రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌కు టోర్నమెంట్ అంబాసిడర్‌గా రోహిత్ శర్మను నియమిస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది. 2024లో కెప్టెన్‌గా కప్ గెలిపించిన హిట్ మ్యాన్, ఇప్పుడు కొత్త హోదాలో ఈ మెగా టోర్నీకి ప్రచారకర్తగా వ్యవహరించనున్నాడు. ఈ నియామకంపై ఐసీసీ ఛైర్మన్ జై షా స్పందిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ చేశారు. "భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు రోహిత్ శర్మను టోర్నమెంట్ అంబాసిడర్‌గా ప్రకటించడం గౌరవంగా భావిస్తున్నాం. 2024 ప్రపంచకప్ విజేత కెప్టెన్, ఇప్పటివరకు జరిగిన తొమ్మిది ఎడిషన్లలోనూ ఆడిన రోహిత్ శర్మ కంటే ఈ ఈవెంట్‌కు మరో మంచి ప్రతినిధి ఉండరు" అని ఆయన పేర్కొన్నారు. 2007లో జరిగిన తొలి టీ20 ప్రపంచకప్‌లో యువ ఆటగాడిగా బరిలోకి దిగిన రోహిత్, 17 ఏళ్ల తర్వాత 2024లో కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించి కప్ అందించారు. ఆ టోర్నీలో పవర్‌ప్లేలో అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆస్ట్రేలియాపై 41 బంతుల్లో 92 పరుగులు, సెమీ ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై కీలక అర్ధశతకం సాధించాడు. ప్రపంచకప్ గెలిచిన వెంటనే హిట్ మ్యాన్ టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఈ కొత్త బాధ్యతపై రోహిత్ శర్మ సంతోషం వ్యక్తం చేశాడు. "ఈ టోర్నమెంట్ మళ్లీ భారత్‌లో జరగడం చాలా ఆనందంగా ఉంది. ఈసారి బ్రాండ్ అంబాసిడర్‌గా కొత్త హోదాలో టోర్నీతో అనుబంధం ఏర్పరచుకోవడం గొప్ప విషయం. ఆటగాళ్లందరికీ నా శుభాకాంక్షలు. వారు భారత ఆతిథ్యాన్ని ఆస్వాదిస్తూ మంచి జ్ఞాపకాలతో తిరిగి వెళ్లాలని కోరుకుంటున్నాను" అని రోహిత్ తెలిపాడు.

## ఆ అధ్యక్షుడిని మార్చండి!

హైదరాబాద్, నవంబర్ 25(భారత శక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఒక లేఖ రాశారు. నల్గొండ డీసీసీ అధ్యక్షుడిని వెంటనే మార్చాలని ఆయన ఆ లేఖలో డిమాండ్ చేశారు. ఇటీవల జిల్లా అధ్యక్షుల నియామకంలో భాగంగా నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా నియమించబడిన పున్నా కైలాశ్ గతంలో తన పట్ల, తన కుటుంబం పట్ల తీవ్ర పదజాలం ఉపయోగించారని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని తక్షణమే డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మీడియా ముందు తమను అసభ్య పదజాలంతో దూషించి అవమానించారని, సామాజిక మాధ్యమాలలో కూడా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయిందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఇది తమ కుటుంబాన్ని బాధించిందని అన్నారు. ఈ మేరకు ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. అలాగే, అతనిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా సరైన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని కోరారు. మరోవైపు, కొత్త డీసీసీ అధ్యక్షుడు కైలాశ్‌కు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్దతు తెలిపారు.

# మహా విశ్వనగరంగా జిహెచ్ఎంసి...

హైదరాబాద్, నవంబర్ 25 (భారత శక్తి): ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధి, దానిని ఆనుకుని అభివృద్ధి చెందుతున్న 27 పరిసర మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు మంగళవారం జరిగిన జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం అంగీకారం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వ ప్రియాంబుల్‌ను టేబుల్ ఐటమ్ 2 గా సమావేశం ముందు ఉంచి ఈ మేరకు చర్చించి ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రభుత్వ మెమో నం.5924/MA(1)/2024, తేదీ 21-11-2025 ప్రకారం ఈ ప్రతిపాదనను కార్పొరేషన్ పరిశీలించి అభిప్రాయం తెలియజేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ పద్ధతిలో జీహెచ్ఎంసీ చట్టం-1955 ప్రకారం తగిన అధ్యయనం చేయాలని కూడా ఆదేశించింది.

**ఏకరీతి అభివృద్ధి అవసరమే..**

ప్రభుత్వం ప్రియాంబుల్ ప్రకారం, నగర పరిసర ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ,




మౌలిక సదుపాయాల అసమాన అభివృద్ధి, పౌరసేవల్లో ఏర్పడుతున్న వ్యత్యాసాలను సమీకరించటం ప్రధాన ధ్యేయం. సమన్వయిత మెట్రోపాలిటన్ ప్రణాళిక ద్వారా రోడ్లు, డ్రైనేజ్, వర్షనీటి మురుగు, పారిశుధ్యం, మున్సిపల్ సేవల్లో సమగ్రతను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ పరిధిలోకి ఈ ప్రాంతాలు చేరితే పౌరుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**విలీనం కింద ఉన్న 27 మున్సిపాలిటీలు**

ఈ ప్రతిపాదనలో పెద్ద అంబర్‌పేట్, జల్పల్లి, శంషాబాద్, తుర్కయాంజల్, మణికొండ, నర్సింగి, ఆదిభట్ల, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, బోల్లారం, తెల్లాపూర్, అమీన్పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్ వంటి మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రస్తుత ఓఆర్ఆర్ పరిధిలో ఇవి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. ఇప్పటికే రోడ్లు, లేఔట్‌లు, వాణిజ్య విస్తరణతో నగరంతో పొసగిపోయిన ఈ ప్రాంతాలు భవిష్యత్తులో మహానగర నిర్మాణంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

* **జీహెచ్ఎంసీ పరిశీలన తరువాత తుది నిర్ణయం**

జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశ ఆమోదం తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. విలీనం జరిగితే హైదరాబాద్ నగర పరిపాలన పరిధి మరింత విస్తరించనున్నది. నగరాభివృద్ధి, పన్నులు, స్థానిక పాలన పరంగా పెద్ద మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి.



## మహిళలకు వడ్డీలేని రుణాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

* **మహిళలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి**
* **రాష్ట్ర టూరిజం శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**
* **వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 25: సూర్యాపేట నియోజక వర్గంలోని ఇందిరా మహిళా శక్తి 1998 ఎస్ హెచ్ జి సంఘాలకు వడ్డీలేని ఋణా పంపిణీ కార్యక్రమం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సుమంగళి ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఘనంగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం శాఖ అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి ముఖ్య అతిథులుగా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు.మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, వారి పేరు మీదనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రతి మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో ఉక్కు మహిళగా ఎదగాలని కోరారు.ఇందిరమ్మస్ఫూర్తితోతెలంగాణప్రభుత్వం ముందుకెళ్తోందని, మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకొనేలా ప్రోత్సహించామన్నారు. ఆర్టీసీలో వెయ్యి బస్సులను మహిళలకు యజమానులను చేశామన్నారు, వడ్డీలేని రుణాలు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ పంప్ ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను మహిళా సంఘాలకే అప్పగించామన్నారు. గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని వదిలేయగా,ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టిందని గుర్తుచేశారు.మహిళా సంఘాలకు ఊరటనిస్తూ రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను విడుదల చేసింది.స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెల్లెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు.తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారీ పెట్టి గౌరవించాలని ఉద్దేశంతో కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు, స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీర ఇస్తున్నామని తెలియజేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి, చిప్ప చేతికిచ్చిన ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్కటిగా హామీలను నెరవేరుస్తున్నామన్నారు, అందులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 500 లకే సిలిండర్, 2 లక్షల రుణమాఫీ,500 బోనాస్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని పేర్కొన్నారు, ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణను ప్రపంచంతోనే పోటీ పడేలా కార్యచరణ రూపొందించి, ముందుకు సాగుతుందని, ప్రజల అండదండలు,ప్రేమ, ఆశీస్సులు మా ప్రజా ప్రభుత్వం పై ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం మాతంగి మైసయ్య సీసీలు విజయభాను,మారిపెద్ది యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడమే జెండర్ క్యాంపైన్ ఉద్దేశ్యం

**: డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి**

కడప, నవంబర్ 25(భారత శక్తి) : ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై వివక్ష, హింస, అసమానతలను తొలగించి లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, మహిళల హక్కుల పరిరక్షణ, సామాజిక సవాళ్ళను అధిగమించడమే.. జెండర్ క్యాంపైన్ ప్రధాన ఉద్దేశ్యం అని డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 202526 జెండర్ కాంపెయిన్ లో భాగంగా.. మంగళవారం ఉదయం జాతీయ స్థాయిలో కేంద్ర వ్యవసాయ మరియు పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జెండర్ కాంపెయిన్ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ డి.బ్లాకులోని డీఆర్డీఏ సమావేశ మందిరం నుండి డిఆర్డీఏ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్డీఏ పీడి మాట్లాడుతూ.. జెండర్ కాంపెయిన్ లో భాగంగా.. లింగ వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళలకు సమాన హక్కులు సమాన అవకాశాలు, మహిళా నాయకత్వం దేశ ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అంశాలపై ముఖ్యంగా మహిళలు, బాలికలతో పాటు సమాజం మొత్తానికి అవగాహన కల్పించేందుకు 25112025 నుండి 2312 2025 వివిధ రకాలుగా క్యాంపైన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది నవంబర్ 25న "అన్ని మహిళలు మరియు బాలికలపై డిజిటల్ హింసను అంతం చేయడానికి ఐక్యం" అనే శక్తివంతమైన ప్రపంచ థీమ్ కింద ప్రపంచం మహిళలపై హింస నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నందున, దేశం ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ రెండింటిలోనూ లింగ ఆధారిత హింసను ఎదుర్కోవడానికి తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందన్నారు. మిషన్ శక్తి యొక్క వన్ స్టాప్ సెంటర్లు, మహిళా హెల్ప్ డెస్కులు మరియు అత్యవసర




హెల్ప్‌లైన్‌ల విస్తరిస్తున్న నెట్‌వర్క్ ద్వారా, భారతీయ న్యాయ సంహిత చట్టాలు, సంస్కరణలు, వేగవంతమైన న్యాయాన్ని నిర్ధారిస్తోందన్నారు. ఈ సమగ్ర ప్రయత్నాలు ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్‌లో ప్రతి స్త్రీ మరియు బాలిక గౌరవం, స్వేచ్ఛ మరియు సమాన అవకాశాలతో జీవించగల సురక్షితమైన, మరింత సమగ్ర వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడుతాయన్నారు. అంతకు ముందు జెండర్ క్యాంపెయిన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా.. ఉదయం నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ నుండి జిల్లాలోని స్వయం సహాయక సంఘ మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటరీ సంస్థలు మరియు అనుసంధాన శాఖల ఉద్యోగులు కలిపి సుమారు 200 మందితో మహావీర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవ హారంగా ఏర్పడి అందరితో జెండర్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అనంతరం ర్యాలీ కలెక్టర్ వారి కార్యాలయం వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా పీడి కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడి రమాదేవి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్ఓ డా. నాగరాజు, డిఆర్డీఏ ఎపిడి ప్రసాద్, పోలీసు, మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రైతులను నిలువునా మోసం చేస్తున్న "మ్యాక్స్" దాన్యం కొనుగోలు కేంద్రాలు

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 25 : అన్నదాతలు నిరక్షరాశులైతే చాలు...అమాయకులైతే చాలు..అదును చూసి నిర్వాహకులు తమకు ఇష్టం వచ్చినట్లుగా కాంటాలు వేస్తున్నారు.ముఖ్యంగా నూతన కళ్ళు మండలం కేంద్రంలో ఓ మ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కాంటాలలో నిలువు దోపిడి వెలుగులోకి వచ్చింది.ప్రభుత్వ అధికారులు అనేకసార్లు నిర్వాహకులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అదేదీ పట్టనట్లుగా...మాక్స్...ధాన్యం కొనుగోలు నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రైతుల అధికారుల కండ్లుగప్పి... ఈ తంతు జరిగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాస్తవానికి బస్తా తూకంతో కలిపి 40 కేజీల 700 గ్రాములు వేయాల్సింది ఉండగా ఈ కేంద్రంలో మాత్రం 41 కేజీ 550 గ్రాములు ధాన్యం కాంటా వేస్తున్నారు. ఇదేమని నిర్వాహకులను అడిగితే అక్కడ ఉన్నవాళ్లు తమ ఇన్చార్జి లేదు అని ఒక మాట.. తమకు తెలుసు ఎంత వేయాలో అని మరొక మాట ఇలా పొంతనలేని సమాధానం ఇస్తున్నారు.ఈ కేంద్రంలో హమాలీలను ఉదయం నాలుగు ఐదు గంటలకేరైతులు




కేంద్రం వద్దకు రాకముందే కాంటాలు వేసి బస్తాలు కొట్టి రెడీగా ఉంచుతున్నారని తెల్లవారి రైతు వచ్చి చూసుకునేసరికి కాంటాలు వేసి ఉంటున్నాయని అక్కడ కొందరు రైతులు మాట్లాడుకోవడం ఆశ్చర్యం ఇదేమని రైతు అడిగితే మీకేం ఇబ్బంది లేదు మీ ధాన్యం ఆల్రెడీ కాంటా వేసాము ఇక టెన్షన్ పడకండి అని చెప్పటం జరుగుతున్నట్లు తెలుస్తోంది.ఈ విధంగా రైతులను మోసం చేస్తున్న ఇలాంటి కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించక పోవడంతో వీళ్ళ ఆగడాలకు అంతులేకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.ఇలాంటి వారికి మరోసారి కేంద్రాల నిర్వహణ బాధ్యత ఇవ్వద్దని చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసిల్దారు శ్రీనివాస్‌ను వివరణ కోరగా తాము అప్పుడప్పుడు కేంద్రాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.ఈ విషయం తమ దృష్టికి రాలేదు తాము తనిఖీ చేసినప్పుడు ఎలాంటి ఇబ్బంది కలిగిన తక్షణమే చర్యలు తీసుకొని అలాంటి వారికి భవిష్యత్తులో కేంద్రాల నిర్వహణ బాధ్యతలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ విషయమై కేంద్రం నిర్వాహకులు సాంబారెడ్డిని వివరణ కోరగా తాను ఈరోజు కేంద్రం వద్ద లేనని తెలిపారు.తమ సహానిర్వాకులు చూసుకోవడం జరిగిందని తెలిపారు.

## వికలాంగులకు సొంత నిధులతో

### చంద్రన్న భరోసా, ఉచిత ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ

* **టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 25: మంగళవారం కామారెడ్డి పట్టణంలోని కామారెడ్డి నియోజకవర్గ చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన ప్రేమలత వికలాంగురాలుకు చంద్రన్న భరోసా ఉచిత ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు తన వంతు సహాయం చేస్తానని, కాంగ్రెస్ పార్టీ, పేదల పార్టీ పేద ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, మామిళ్ళ అంజయ్య, నిమ్మ విజయ్ రెడ్డి తాజా మాజీ కౌన్సిలర్లు, ఊర్దొండ



రవి, చిన్న మల్లారెడ్డి మాజీ సర్పంచ్ ఆనంద్ రావు, హనుమాన్ల గంగయ్య, రాము, కుమార్, చాట్ల వంశీ, పంపరి శ్రీనివాస్, పిడుగు మమత, సాయిబాబా, శంకర్ రావు, గడ్డమీది మహేష్, మామిల్ల రమేష్, రవి పటేల్, రంగ రమేష్, నవీన్, యూత్ నాయకులు, ఆబిద్, ఇమ్రాన్, బల్ల శ్రీనివాస్, కిరణ్, నర్సుల మహేష్, మున్నా, శశి, శ్రీకాంత్, హైమద్,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అరాచకాలపై 'విద్యార్థి రణభేరి': కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ అరాచకాలపై 'విద్యార్థి రణభేరి' మోగించాలని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకుల సమస్యలపై త్వరలో పోరుబాట పడతామన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నేతలతో మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. వచ్చే నెల నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. సామాజిక మాధ్యమాల వేదికగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ''విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. బీసీ డిక్లరేషన్‌లోని హామీలు అమలయ్యే వరకు పోరాడాలి. రూ.5 లక్షల కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు పాలసీ తీసుకొచ్చారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.